మాలకొండ హుండీల ఆదాయం రూ. 1,11,59,854

వలేటివారిపాలెం : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 12 శనివారాలకు గాను 37 హుండీల ద్వారా రూ.1,11,59,854 ఆదాయం లభించింది. మాలకొండ కల్యాణ మండపంలో ప్రథమ శ్రేణి కార్యనిర్వాహణాధికారి వీవీఎల్ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. ఆ లెక్కింపులో నగదుతోపాటు 280 గ్రాముల బంగారం, 1634 గ్రాముల వెండి, 175 యూఎస్, 100 ఆస్ట్రేలియా, 60 యూరప్ డాలర్లు, 2 డైమండ్స్, 1 క్యూటన్ రాయల్, 100 సౌతాఫ్రికా రాండ్ లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ లెక్కింపులో మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంగం : డ్రమ్ముల్లోని కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులోకి వేస్తున్న దృశ్యం

వ్యర్థం.. అనర్థం!

జిల్లాలోని సంగం, బుచ్చిరెడ్డిపాళెం, చేజర్ల, టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు తదితర మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో అధికారికంగా, మరో పదివేల ఎకరాల్లో అనధికారికంగా చేపల చెరువులు (గుంటలు) ఉన్నాయి. ఫంగస్, రూప్‌చంద్, గండి, బొచ్చె, క్యాట్‌ఫిష్ తదితర రకాలకు చెందిన చేపలను సాగు చేస్తున్నారు. స్థానికంగా కొందరు, ఉత్తరాది జిల్లాల నుంచి వలస వచ్చిన కొందరు ఇక్కడున్న మాగాణి భూములను కౌలుకు తీసుకుని చేపల చెరువు ఏర్పాటు చేసుకుంటున్నారు.

చికెన్, చేపల మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఎప్పుడైనా గమనించారా!? కోడిలో ఉన్న వ్యర్థాలను తొలగించి మనకు మాంసం మాత్రం తూకం వేసి ఇస్తారు. మరి ఆ వ్యర్థాలను ఏం చేస్తారని ఆలోచించారా!? లేదు కదా! ఇందులో నమ్మలేని నిజం ఒకటి ఉంది. ఆ వ్యర్థాలనే మనం తింటున్నాం. నమ్మశక్యంగా లేదా!? నిజమండీ. మహానగరాలు, పట్టణాల్లో భారీస్థాయిలో ఉత్పత్తి అయ్యే ఎందుకూ పనికిరాని చికెన్ వ్యర్థాలను జిల్లాలో డంప్ చేస్తున్నారు. ఇక్కడ వేల ఎకరాల్లో ఉన్న గుంతల్లోని చేపలకు వాటిని ఆహారంగా వేస్తున్నారు. చేపలు పెద్దవయ్యాక అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మన ఆరోగ్యంతో చెలగాటం అడుతున్న ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియానే ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని మీకు అనుమానం రావొచ్చు. ట్రిప్పునకు, నెల మామూళ్లు అందుతుండటంతో వారు కూడా ఆ పాపంలో పాలు పంచుకుంటున్నారు. అదెలాగో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ఈ ప్రత్యేక కథనం చదవండి.

● మేత ఖర్చు తగ్గుతుందనీ..

సంప్రదాయ చేపల మేత కిలో రూ.35 ధర ఉండగా, చికెన్ వ్యర్థాలు రూ.8లకే దొరుకుతుంది. ఒక ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేత రోజుకు 20 కేజీల వరకు వేయాల్సి ఉండగా ఖర్చు రూ.700. నెలకు రూ.21 వేలు అవుతుంది. కూలికి రూ.100 చొప్పున నెలకు రూ.3వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం ఖర్చు రూ.24 వేలు. అదే చేపల వ్యర్థాలు 200 కేజీల డ్రమ్ము రూ.1600లకే చేపల చెరువులో వేసి వెళతారు. రెండు డ్రమ్ముల చొప్పున నెలకు 8 డ్రమ్ముల చికెన్ వేస్ట్ సరిపోతుంది. ఇందుకు రూ.12,800 ఖర్చు అవుతుంది. అంతేగాక చేప పిల్లల ఎదుగుదల బాగుంటుంది. ఎంతలేదన్నా ఒక ఎకరాలో రైతుకు సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు తగ్గుతుంది.

● రవాణాదారులకూ ఆదాయమే!

ఆంధ్రజ్యోతి ఫోకస్

అంతేకాదు... చికెన్ వ్యఆర్థలకు సరఫరా చేసే వారికీ భారీ ఆదాయం ఉంటోంది. పట్టణాలు, నగరాల్లో ఒకనాడు వృథాగా పడేసే చికెన్ వేస్టేజీని చేపల చెరువులకు వినియోగించడంతో దళారుల మధ్య పోటీ పెరిగింది. కిలో రూ.2 నుంచి 3లకు అంటే 200 కేజీల డ్రమ్ము రూ. 400లకు కొనుగోలు చేసి, రవాణా ఖర్చుతో కలిపి రూ. 1600లకు విక్రయిస్తున్నారు. ఒక్కో లారీలో సుమారు 80 డ్రమ్ముల వేస్టేజీని జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. డ్రమ్ముకు వెయ్యి మిగిలినా ట్రిప్పునకు రూ.80 వేల వరకు ఆదాయం ఉంటోంది. నెలలో నాలుగు సార్లు తెస్తే రూ. 3.2 లక్షలు ఆదాయం వస్తుంది.

● మహా నగరాల నుంచి దిగుమతి

చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహా నగరాలతోపాటు రాయలసీమ జిల్లాల్లోని పలు పట్టణాల్లో చికెన్ దుకాణాల్లో కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని డ్రమ్ముల్లో వేసుకుని వాహనాల్లో చేపల చెరువులకు తరలిస్తున్నారు. దారి పొడవునా ముక్కుపుటాలదిరే దుర్వాసన భరించలేక పీల్చిన రైతులు, ప్రజలు నెమ్ము సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఒక్క బుచ్చి ప్రాంతానికే రోజుకు సుమారు 30 నుంచి 50 వాహనాలలో వ్యర్థాలను తీసుకువస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియానే ఉందని సమాచారం. కోళ్ల వ్యర్థాల రవాణాను అడ్డుకోకుండా ఇటు మత్స్య శాఖ, అటు పోలీస్‌లను మామూళ్లతో మభ్యపెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తుండటంతో చెరువు వద్దకు చేర్చేసరికి కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి పురుగు పట్టి తీవ్ర దుర్గంధం వెదజలుతున్నాయి. కొంత మంది (ఫంగస్ చేపల చెరువులకు) నేరుగా చేపలకు మేతగా వేస్తుండగా మరి కొందరు ప్రత్యేక పాత్రల్లో ఉడకబెట్టి మేతగా వేస్తున్నట్లు సమాచారం. దీంతో చెరువులోని నీరు పూర్తిగా పాడవుతోంది. ఇదే నీటిని ఊట కాలువలకు విడిచిపెట్టినప్పుడు సమీపం పంట పొలాలు, మంచినీటి చెరువుల్లోకి చేరుతోంది. దీంతో పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపల చెరువుల్లో చికెన్ వేస్టేజీ డంప్	మహా నగరాల నుంచి భారీగా దిగుమతి	అక్కడ రూ.వందలకు కొని ఇక్కడ రూ.వేలకు విక్రయాలు	మత్స్య శాఖ నుంచి పోలీసుల వరకు మామూళ్లు	ఆ చేపలు తింటే ప్రాణాలకే ముప్పు	పొలాలు, సాగునీటి కాలువలూ విషతుల్యం





బుచ్చిరెడ్డిపాళెం : మినగల్లులోని ఓ చేపలగుంతలో నీటిలో తేలియాడుతున్న వ్యర్థాలు



బుచ్చిరెడ్డిపాలెం : సాగునీటి కాలువలోకి వదిలిన వ్యర్థాల నీరు

● నియంత్రణ శూన్యం

కోళ్ల వ్యర్థాలు తరలించేవారిపై మత్స్య శాఖ అధికారులు, సిబ్బంది నిఘా ఉంచి వాహనాలను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కానీ ఆ శాఖ అధికారులు పత్తాలేకపోవడంతో పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చేపల చెరువులు ఉన్న మండలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి మామూళ్ల వసూలు చేసి ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారికి నెల మామూళ్లు ఇచ్చేవారని అప్పట్లో బహిరంగంగా ఆరోపణలు వినిపించాయి.



బెంగుళూరు నుంచి డ్రమ్ముల్లో తెచ్చిన వ్యర్థాలు

అయితే, ఆ అధికారి బదిలీపై వెళ్లినా మామూళ్ల వసూలు యథావిధిగా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేస్తే వాహనాలకు కోర్టులో పూచీకత్తు అందజేసి మళ్లీ యథావిధిగా వ్యర్థాలను తీసుకొస్తున్నాయి.

● చెరువులకు సాగునీరు..

చేపల చెరువులకు బోరు పాయింట్ ఉందా లేదా అని చూసి మత్స్య శాఖ అనుమతి ఇస్తుంది. కానీ, క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. పంట పొలాలకు వెళ్లే కాలువలకు మోటార్లు పెట్టి నీటిని నిరంతరం లిఫ్టు చేస్తున్నారు. దీంతో సాటి నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సమీప రైతులు ఆవేదన చెందుతున్నారు. బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలవల వెంబడి ఉన్న చేపల గుంతల్లోని వృథా నీటిని ఈ కాలువల్లోకే వదిలేస్తున్నారు. చుట్టుపక్కల రైతులు, ప్రజలు, రవాణా చేసే కూలీలు, క్యాన్సర్, అలర్జీ, నెమ్ము సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.

● వ్యాధుల భయం

చేపలకు కోళ్ల వ్యర్థాలను వినియోగించడం వల్ల తీవ్రస్థాయిలో దుష్పరిణామాలు తలెత్తుతాయి. ఈ చేపలను తిన్నా, కలుషితమైన నీటి వల్ల శ్వాసకోస వ్యాధులతోపాటు ఇన్‌ఫ్లూయంజా, ఫ్లూ వంటి చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య ఆరోగ్య అధికారులు చెబుతున్నారు.

పోలీసులతోనే సాధ్యం



వ్యర్థాల నియంత్రణ చేయాలంటే మా దగ్గర సిబ్బంది కొరత ఉంది. పోలీసుల సహకారం ఉంటే నివారించవచ్చు. అలాగే రెవెన్యూ అధికారులతోపాటు ప్రజల సహకారం కూడా ఉండాలి. గ్రామపంచాయతీల్లో పంచాయతీ అధికారులతో ప్రజలకు కోళ్ల వ్యర్థాలపై అవగాహన కల్పించి చర్యలు చేపడుతున్నాం. వ్యర్థాలను వాడుతున్న గుంటల అనుమతులు రద్దు చేయవచ్చు.

- నాగేశ్వరరావు, మత్స్య శాఖ జేడీ

- సంగం/బుచ్చిరెడ్డిపాళెం



సంగం బ్యారేజీకి ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు తొలగిస్తున్న బ్యారేజీ కనస్ట్రక్షన్ నిర్వాహకులు

పెన్నానదిపై బ్యారేజీల పేరు మార్పు!



నెల్లూరు బ్యారేజీగా ఏర్పాటు చేసిన బోర్డు

సంగం, సెప్టెంబరు 13: సంగం, నెల్లూరు బ్యారేజీల పేరు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును శుక్రవారం బ్యారేజీ కనస్ట్రక్షన్ నిర్వాహకులు తొలగించారు. సంగం ఆనకట్ట స్థానంలో 2022లో నూతన బ్యారేజీ నిర్మించి ప్రారంభించిన విషయం విదితమే. బ్యారేజీ ప్రారంభ సమయంలో మంత్రిగా ఉండి అకాల మరణం పొందిన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును అప్పటి వైసీపీ ప్రభుత్వం నామకరణం చేసింది. కాగా, ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పలు బ్యారేజీలకు పాత పేర్లనే పునరుద్ధరిస్తూ జీవో జారీ చేసింది. ఆ మేరకు బ్యారేజి కనస్ట్రక్షన్ నిర్వాహకులు సంగం బ్యారేజీ వద్ద ఉన్న నేమ్ బోర్డులో మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు. అలాగే నెల్లూరులోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ పేరును కూడా తొలగించి, నెల్లూరు బ్యారేజీగా మార్పు చేశారు.

పోలీసు కస్టడీకి మేయర్ భర్త

- కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో జైలులో ఉన్న జయవర్ధన్
- నాలుగు రోజుల కస్టడీకి నేడు అప్పగింత
- ఎన్ని నిజాలు వెలుగు చూసేనో!

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13: నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడిగా ఉన్న మేయర్ భర్త పీ జయవర్ధన్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ శుక్రవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జయవర్ధన్ ప్రస్తుతం జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. నగరపాలక సంస్థ పూర్వ కమిషనర్లు హరిత, వికాస్ మర్మత్ సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన కేసులో ఆయన అభియోగాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూలైలో నాటి కమిషనర్ వికాస్ మర్మత్ ఫిర్యాదు మేరకు టీపీవోలు ప్రవీణ్‌కుమార్, దేదేంద్ర, వార్డ్‌ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు నాగేంద్రబాబు, కార్తీక్‌మాలవ్య, స్ట్రక్చరల్ ఇంజనీర్ అండ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ దిలీప్‌కుమార్, నగర మేయర్ భర్త పీ జయవర్ధన్, ఆయన సహాయకుడు శివకృష్ణపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ జయవర్ధన్ నెల్లూరు ఐదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో జయవర్ధన్‌ను పోలీసులు కేంద్ర కారాగారానికి తరలించారు. కేసులో పూర్తి స్థాయి దర్యాప్తు కోసం తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతించడంతో శనివారం జయవర్ధన్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ నాలుగు రోజుల్లో ఆయన నుంచి ఎన్ని నిజాలు వెలుపలకు వస్తాయో అన్న ఉత్కంఠ ఇటు కార్పొరేషన్‌లో, అటు రాజకీయ వర్గాల్లో నెలకొంది.

అక్రమ రిజిస్ట్రేషన్..
ముగ్గురిపై సస్పెన్షన్ వేటు!

నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ స్టాంపులు-రిజిస్ట్రేషన్‌ల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ జాఫర్‌ను, అదే కార్యాలయంలో పని చేస్తున్న సింహాద్రి నాయుడు, స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మిల్కీ రోషన్‌లపై వేటు పడింది. ఈ ఉత్తర్వులు అందుకున్న ఆ ముగ్గురు వెంటనే రిలీవ్ అయ్యారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మాట్లాడుతూ సస్పెండ్ అయిన వారి స్థానంలో ఇంకా ఎవరినీ ఇన్‌చార్జులుగా నియమించలేదని తెలిపారు.

15 నుంచి
కోనలో పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 13: పెంచలకోన క్షేత్రంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు పెనుశిల లక్ష్మీనరసిం హస్వామికి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉప కమి షనర్, కార్య నిర్వహణాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జిల్లాకు 39 కొత్త ఆర్టీసీ బస్సులు

● 12 అద్దె బస్సులు కూడా.. ● త్వరలో మరో 32..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 13: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు ఒక్క కొత్త బస్సును కూడా కేటాయించలేదు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రీజియన్‌కు సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు 39, అద్దె బస్సులు 12 జిల్లాకు చేరుకొని రోడ్లపై పరుగెడుతోన్నాయి. త్వరలో మరో 32 బస్సులు రీజియన్‌కు రానున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్క బస్సు కూడా కొత్తది రాకపోవడంతో కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులకు మరమ్మతులు చేసి వాటినే రోడ్లపై తిప్పారు. గుంతలమయమైన రోడ్లపై ప్రమాదకరమైన ప్రయాణం ఓ పక్క, మరమ్మతుల ఖర్చు మరో పక్క, కేఎంపీఎల్ రాకపోవడం, ఇలా అన్నివిధాలుగా ఆర్టీసీ సంస్థ నష్టపోతోందని ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేరు. ప్రస్తుతం వచ్చిన కొత్త బస్సులను కాలం చెల్లిన బస్సుల స్థానంలో అదే రూట్లలో నడుపుతూ ప్రయాణికులకు ప్రశాంతమైన ప్రయాణం అందిస్తున్నారు. మరో 32 బస్సులు త్వరలో రానుండటంతో దూర ప్రాంతాలకు సర్వీసులను పెంచే ఆలోచనల్లో అధికారులు ఉన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్), సెప్టెంబర్ 13 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అదాలత్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో శని వారం నిర్వహించనున్నారు. అన్ని న్యాయస్థానాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి రాజీకి యోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, మోటార్ యాక్సిడెంట్ కేసులు, లేబర్ కోర్టు కేసులు పరిష్కరించనున్నారు. దీనిని కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రెసిడెంట్ సీ యామిని, సెక్రటరీ కే వాణి సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.

కార్పొరేషన్‌లో కౌన్సెలింగ్

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 13 : జిల్లాలోని నగర పాలక సంస్థతోపాటు ఇతర మున్సిపాలిటీల్లోని సచివాలయ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం జరిగింది. వివిధ విభాగాలకు చెందిన 72 మంది కార్యదర్శులు బదిలీలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు 53 మంది మాత్రమే హాజరైనట్లు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. పురపాలక శాఖ నిబంధనలు మేరకే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కౌన్సిలింగ్‌కు హజరైన సెక్రటరీలు


చిట్టిచేతులు.. పెద్ద సాయం



ఇంటి నుంచి తెచ్చిన నోట్లను చూపుతున్న చిన్నారులు

మనుబోలు: విజయవాడ వరద బాధితుల కోసం మేమూ ఉన్నామంటూ ముందుకు వచ్చారు. మనుబోలు మండలం పిడూరుపాళెం ఉజ్వల ఇంగ్లీషు మీడియం స్కూల్ చిన్నారులు రూ.11వేలు పోగుచేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య మాట్లాడుతూ చిన్నారులు పోగుచేసిన విరాళంతో పాటు, ఉపాధ్యాయులు, ఇంకొంతమంది నుంచి విరాళాలు సేకరించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో స్కూల్ కరస్పాడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రత్నం' చేయూత



నెల్లూరు (విద్య) : వరద బాధితులకు రత్నం విద్యాసంస్థల యాజమాన్యం తమ వంతుగా చేయూత అందించాయి. విద్యాసంస్థల డైరెక్టర్ కొర్రపాటి వేణుగోపాల్ తనయుడు సాయి రోహిత్ శుక్రవారం రూ.5 లక్షల చెక్కును విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందచేశారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.

'మేకపాటి' రూ.25 లక్షలు..

నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి శుక్రవారం సీఎం సహాయనిధికి రూ.25 లక్షల విరాళ డీడీని పంపారు. గతంలో రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.25 లక్షల చొప్పున మేకపాటి రాజమోహన్‌రెడ్డి విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.25 లక్షల డీడీని స్పీడ్ పోస్టు ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పంపారు.

నేటితో ముగియనున్న పొగాకు వేలం

● ఇప్పటిదాకా రూ.252 కోట్ల ఉత్పత్తి విక్రయం



మర్రిపాడు, సెప్టెంబరు 13 : మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో శనివారం పొగాకు వేలం ముగియ నున్నది. ఈ బోర్డు పరిధిలో 10 మండలా లల్లో 1,785 బ్యారన్‌లు, 2083 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ ప్రకారం 6.3 మిలియన్ కేజీలను కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. గత ఏడాది మంచి ధర లభించటంతో 2023-24 సీజన్‌లో ఎక్కువ మంది రైతులు అనుమతికి మించి పొగాకు సాగు చేశారు. గత ఏడాది కేజీ ధర రూ.245లతో ముగియగా ఈ ఏడాది రూ.230తో ప్రారంభమై రూ.358తో ముగియనున్నది. అనుమతి మేర జూన్ 15 నాటితో బోర్డులో కొనుగోలు పూర్తి చేశారు. అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖను రైతులు బోర్డు తరఫున అనుమతి కోరారు. దీంతో స్పందించిన ఆ శాఖ ఎటువంటి అపరాధ రుసుం లేకుండా జులై 26 నుంచి కొనుగోలు ప్రారంభమై శనివారం ముగియనున్నది. ఇప్పటిదాకా 9.7 మిలియన్ కిలోల పొగాకును వివిధ కంపెనీలు రూ.252 కోట్లకు కొనుగోలు చేశాయి. ఆదివారం నుంచి మూడు రోజులు స్క్రాప్ (సూర)ను కొనుగోలు చేయనున్నట్లు వేలం నిర్వహనాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

కృష్ణానదీ జలాల బోర్డును అమరావతిలో ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : కృష్ణానదీ జలాల బోర్డును అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రజారైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టు రేణుకారెడ్డి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత కృష్ణానదీ జలాలను రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల రైతులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ జిల్లాల ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయాల్సిన బోర్డును గత ప్రభుత్వం అనాలోచితంగా వైజాగ్‌లో ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ట్రెజరర్ ఎం బీమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయబాబు, సహాయ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రులకు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శరన్నవరాత్రి ఉత్సవాల పనులు ప్రారంభించేందుకు గుంజ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనర్ బీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అమ్మవారి 50వ శరన్నవరాత్రి వేడుకలు అక్టోబరు 3 నుంచి 12వతేదీ వరకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతాయని తెలిపారు. అమ్మవారి భవానీ దీక్ష మాలధారణ ఈ నెల 20న జరుగుతుందని తెలిపారు. ఇరుముడి ఉత్సవం అక్టోబరు 11వతేదీ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సుజితమ్మ, భానుశ్రీ, ధర్మకర్త రత్నం జయరామ్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

23న వారాహి మహారథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : లోక కల్యాణం, ప్రజల సంక్షేమం కోసం నగరంలో ఈనెల 23న వారాహి మహారథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ ఉపాసకుడు మహారుద్రస్వామి తెలిపారు. శుక్రవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన శిష్య బృందంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. యాత్ర ఈనెల 22న తిరుపతిలోని జీవలింగేశ్వర స్వామి ఆలయం నుంచి ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. 28వతేదీ వరకు జిల్లాల వారీగా ప్రయాణిస్తూ అనకాపల్లికి చేరుకుంటుందని చెప్పారు. మార్గ మధ్యంలో భక్తులతో బిల్వ, మారేడు, వేప, జమ్మి తదితర దేవతా మొక్కలు నాటిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94922 24756 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నిఖిలేష్ నాయుడు, సుధారాణి, మణి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13: మండలంలోని ఏరుకొల్లు గ్రామ సమీపంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

కాలువల కుంభకోణంపై విచారణ జరపాలి

● తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమ నాయుడు



మాట్లాడుతున్న రాధాకృష్ణమనాయుడు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13 : జిల్లాలో గతేడాది ఇరిగేషన్ కాలువలు తవ్వకుండానే తవ్వినట్లు చూపించిన రూ.100 కోట్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపూరు రాధాకృష్ణమ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కుంభకోణంలో వైసీపీకి చెందిన బడా నాయకులు ఉన్నారన్నారు. నీటి పారుదల కాలువలు పూడ్చి లేఅవుట్లు వేశారని, కలెక్టర్ చర్యలు తీసుకుని కాలువల్లో నీటి పారుదలను పునరుద్ధరించాలని కోరారు. సాగునీరు అందక మాగాణి భూములు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అక్రమిత కాలువలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఖరీఫ్ సీజన్ వస్తున్న కారణంగా రైతులు నార్లు పోసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో కాలువల్లో పూడిక తీసేందుకు నామినేషన్ పనులను రైతులకే అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు నేతలు వెంకట రామారావు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, మాగుంట రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

● జిల్లా స్థాయి పోటీల్లో డీఈవో రామారావు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో రామారావు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, కళా రంగాల్లో కూడా రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటి పోటీ ప్రపంచంలో యువత అన్ని విభాగాల్లో ప్రతిభ చూపి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థులు వారి భవిష్యత్‌ను విజ్ఞానదాయకంగా తీర్చిదిద్దుకునేలా తర్ఫీదునందించాలన్నారు. రానున్న రోజుల్లో విద్యాశాఖ తరపున ఏడాదికి 50 కార్యక్రమాలకుపైగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అంద చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ కేంద్రం ఇన్‌చార్జి డీ కరుణాకర్ రెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కే భక్తవత్సల నాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, వక్తృత్వ పోటీల్లో చెన్నపల్లిపాళెం జడ్పీ పాఠశాలకు చెందిన బీ లాలస, వేగూరు జడ్పీకి చెందిన పీ జాహ్నవి, దర్గామిట్ట జడ్పీ స్కూల్‌కు చెందిన ఎస్‌కే కరిష్మా తొలి మూడు స్థానాలను దక్కించుకున్నారు. వ్యాసరచన పోటీల్లో దర్గామిట్ట జడ్పీ పాఠశాలకు చెందిన ఏ నిరంజన్, మొగళ్లూరు జడ్పీకి చెందిన ఎన్ కార్తీక్, దర్గామిట్ట జడ్పీ స్కూల్‌కు చెందిన టీ యషీ విజేతలుగా నిలిచారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	131
లేయర్ లైవ్	108
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260
లేయర్	184

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7035
వెండి కిలో ధర	రూ. 88,500
వెండి ఒక గ్రాము	రూ. 91.50

ప్రాణాలు నిలబెట్టే ఫస్ట్‌ఎయిడ్

ప్రాథమిక వైద్యానికి ఎంతో ప్రాధాన్యం

అత్యవసర పరిస్థితుల్లో కీలకం

ఏటా వెయ్యి మందికి రెడ్‌క్రాస్ శిక్షణ

పరిశ్రమల్లో సిబ్బందికి శిక్షణ ఏది..?

నేడు ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే

ప్రమాదాలు, విషకీటకాల కాటు, ఆత్మహత్యాయత్నం.. ఇలా ఊహించని ఘటనలు జరిగినప్పుడు బాధితులకు అసలు వైద్యం కన్నా తక్షణం అందించే ప్రాథమిక వైద్యమే వారి ప్రాణాలను నిలబెడుతుంది. రక్తమోడుతున్న క్షతగాత్రులకు ఆ రక్తస్రావాన్ని అరికట్టి ఆసుపత్రికి తరలించడం, గుండెపోటుతో విలవిలలాడేవారికి సీపీఆర్ వంటి ప్రాథమిక చికిత్సలు అందిస్తే వారిని ప్రాణాపాయం నుంచి గట్టెక్కించిన వారవుతారు. అందుకనే అత్యయిక పరిస్థితిలో ఉన్న వారికి అందితే ప్రాథమిక వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రతి ఒక్కరు కూడా ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కలిగి ఉంటే ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు, విపత్తుల సమయంలో వారిని వారు కాపాడుకోవడమేకాక తోటివారిని రక్షించడానికి వీలుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13 : ప్రాథమిక వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇలాంటి వైద్య చికిత్సల వల్ల జిల్లాలో ఎందరివో ప్రాణాలను కాపాడిన సందర్భాలున్నాయి. జిల్లాలో ఏటా 3వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ సందర్భంలో ప్రాథమిక చికిత్స ఎంతో అవసరం. బాధితులకు స్థానికులతో పాటు 108 వంటి వాహనాల సిబ్బంది ప్రాథమిక చికిత్సలు అందించి ఆసుపత్రులకు తరలిస్తున్నారు. అలాగే గర్భవతులకు అత్యవసరమైన స్థితిలో ప్రాథమిక వైద్యం ఎంతో ఉపయోగపడుతుంది. జిల్లాలో సుమారు వెయ్యి మంది గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. అలాగే, రెడ్‌క్రాస్ సొసైటీ కూడా ఏటా వెయ్యి మందికి ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇస్తోంది. ఢిల్లీకి చెందిన సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. తర్ఫీదు పొందిన వారు ప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్సతోపాటు ప్రత్యేకించి ఏడాదికి ఒకసారి బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగ సమయంలో యాత్రికులకు ప్రాథమిక వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఏడాది ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ, డిజిటల్ ప్రపంచంలో ప్రథమ చికిత్స అన్న నినాదాన్నిచ్చింది. సెల్‌ఫోన్ ద్వారా ప్రాథమిక చికిత్స విధానాలు తెలుసుకుని తక్షణ వైద్యం అందించాలని పిలుపునిచ్చింది.



ఎంతో ఉపయోగం



ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వారికి వైద్య నిపుణులు అత్యుత్తమ చికిత్స అందించవచ్చు. జిల్లాలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఆ సమయాల్లో బాధితులకు రక్తం పోకుండా గాయాలకు కట్టుగట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. గుండెకు సంబంధించిన వ్యాధులకు సీపీఆర్ వంటి చికిత్సలు అందించాలి. ఇలాంటి ప్రాథమిక చికిత్సలెన్నో వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడతాయి.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు

పరిశ్రమల సిబ్బందికి శిక్షణ ఏది?

జిల్లా వ్యాప్తంగా ఎన్నో పరిశ్రమలు ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టు పరిధిలోనే పదుల సంఖ్యలో పరిశ్రమలు నడుస్తున్నాయి. వాటిలో ఉద్యోగులుగా చేరాలంటే ప్రాథమిక వైద్యం సర్టిఫికెట్ తప్పనిసరి. కేవలం 15 రోజులు ప్రాథమిక వైద్యంపై శిక్షణ పొందడం ద్వారా సర్టిఫికెట్ లభిస్తుంది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణనష్టాన్ని నివారిం చేందుకు వీరు ఎంతో ఉపయోగపడతారు. కానీ, ఈ నిబంధన సక్రమంగా అమలు కావడం లేదు. చాలా మంది నకిలీ ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లో చేరుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రమాదస్థలిలో ప్రాథమిక చికిత్స అందిస్తున్న స్థానికులు (ఫైల్)

ప్రాథమిక చికిత్సలు ఇలా..

ప్రాథమిక వైద్య చికిత్సలపై వైద్య నిపుణులు మార్గదర్శకాలు సూచిస్తున్నారు. పలు వ్యాధులు, ప్రమాదాలకు సంబంధించి వెంటనే అత్యుత్తమ వైద్య చికిత్సలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో ప్రాథమిక వైద్యం ఎలా అందించాలో తెలియచేస్తున్నారు.

● పాము కాటుకు గురైనప్పుడు కాటు పడిన భాగాన్ని కదలకుండా ఉంచాలి. బిగుతుగా ఉన్న దుస్తులు, నగలు తీసివేయాలి. వెంటనే వైద్యుని వద్దకు తరలించి చికిత్స అందించాలి.

● ప్రమాదాల్లో గాయపడ్డప్పుడు గాయాలను శుభ్రపరిచి రక్తం ఎక్కువ పోకుండా వత్తి ఉంచాలి. తడిగుడ్డతో కట్టు కట్టాలి.

● ఏదైనా విషం తాగితే తక్షణం ఆ విషాన్ని కక్కించే ప్రయత్నం చేయాలి. వైద్యుని వద్దకు వెంటనే తీసుకెళ్లాలి.

● మూర్ఛ పోయిన రోగిని తక్షణం తిప్పి పడుకోబెట్టాలి, స్వచ్ఛమైన గాలి అందేలా చూడాలి. కొద్దిగా కోలుకోగానే వైద్యుని సంప్రదించాలి.

● డీహైడ్రేషన్‌కు గురైన వారికి వెంటనే నీరు తాగించాలి, చల్లని ప్రదేశానికి తరలించాలి. లో షుగర్ అయితే స్పృహలో ఉంటే చక్కర వంటి తీపి పదార్థం ఇవ్వాలి, తర్వాత వైద్యుని సంప్రదించాలి.

● గుండె వ్యాధి వల్ల ఊపిరితీసుకోవటంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సీపీఆర్ చికిత్స ద్వారా ప్రాథమిక వైద్యాన్ని అందించాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అత్యవసర ప్రాథమిక వైద్యాన్ని అందించేందుకు ఇన్‌హేలర్‌ను వినియోగించాలి.

● కాలిన గాయాలకు బర్న్ క్రీమ్, థర్మామీటర్, దెబ్బలకు కట్టుకట్టేందుకు గాజుగుడ్డ, చేతి తొడుగులు, కత్తెర, పట్టకార, అత్యవసర మందులు వంటివి ఇంటిలో అందుబాటులో ఉంచుకోవాలి.

చిన్నచిన్న వ్యాధులకు వైద్యం



జిల్లా వ్యాప్తంగా 1000 మందికిపైగా గ్రామీణ వైద్యులు ఉన్నారు. వీరంతా ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. రెడ్‌క్రాస్ లో కూడా ప్రాథమిక వైద్యంపై తగిన శిక్షణ తీసుకున్నాం, రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణం ప్రాథమిక వైద్యం అందిస్తున్నాం. జ్వరం వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు తగిన చికిత్సలు చేస్తున్నాం.

- శాఖవరపు వేణుగోపాల్, సీహెచ్‌సీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జగన్ మానసిక రోగి

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం

నెల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఒక మానసిక రోగి అని టీడీపీ రాష్ట్ర అధి కార ప్రతినిధి ఆనం వెంకటరమ ణారెడ్డి విమర్శించారు. శుక్రవారం నెల్లూరు లోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ వరదల్లో అరవై మంది మరణించారని జగన్ చెబుతున్నారని, అంతమంది ఎక్కడ చనిపోయారో నిరూపించాలని సవాల్ విసిరారు. ఎంత ఎక్కువ మంది చనిపోతే చంద్రబాబుకు అంత చెడ్డ పేరు వస్తుందని జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారని ఆనం మండిపడ్డారు. మనిషి చనిపోవాలని ఎవరూ కోరుకోరని, జగన్ ఆ ఆలోచన చేస్తున్నారంటే ఆయన మానసిక స్థితిపై ఆందోళన కలుగుతోందని వ్యాఖ్యా నించారు. తన హాలిడే పాయింట్ అయిన జైలును చూడగానే జగన్ ఏదేదో మాట్లాడారని ఎద్దేవా చేశారు. టీడీపీ జాతీయ కార్యాలయంపై కర్రలు, కత్తులు, రాడ్లు, బీరు బాటిళ్లతో దాడి చేస్తే దానిని శాంతియుత నిరసనగా జగన్ అభివర్ణించడం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ కార్యకర్తలు కూడా జగన్ ఇంటిపై, వైసీపీ కార్యాలయాలపై ఇదేవిధంగా శాంతి యుత నిరసన తెలిపేందుకు జగన్మోహన్‌రెడ్డి ఒప్పుకుంటారా..? అని ప్రశ్నించారు.

సోమశిలలో 48.997 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 15,300 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 48.997 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్లాంటేషన్ పనుల తనిఖీ



కనియంపాడులో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, సెప్టెంబరు 13: మండలంలోని కనియంపాడు, విరువూరు గ్రామాల పరిధిలోని ప్లాంటేషన్‌లలో జరిగిన పనులను శుక్రవారం అటవీశాఖ స్క్వాడ్ అధికారులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రూ. కోటికి ఎసరు కథనానికి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి పనులు జరిగిన తీరుపై ఆరా తీశారు. కనియంపాడులో 116హెక్టార్లకు గాను ఇంతవరకు 76హెక్టార్లలో నాటిన మొక్కలతో పాటు నర్సరీని పరిశీలించారు. 10శాతం మొక్కలు చనిపోయినట్లు గుర్తించి ఆ స్థానంలో నూతన మొక్కలు నాటాలని సూచించారు. అలాగే విరువూరులో 40హెక్టార్లలో నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్షన్, బీట్ అధికారులు చినవెంకటయ్య, రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎట్టకేలకు డయాలసిస్ యూనిట్ సేవలు ప్రారంభం



కిడ్నీ డయాలసిస్ విభాగంలో వైద్యులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎట్టకేలకు కిడ్నీ డయాలసిస్ యూనిట్ సేవలు మొదలయ్యాయి. గత నెల 9వ తేదీన బయ్యా సరోజ నమ్మ పేరుతో ఆమె కుమారులు బయ్యా రవికుమార్, బయ్యా శ్రీనివాసులు రూ.80 లక్షల వ్యయంతో డయాలసిస్ యూనిట్, ఆరు పడకలు ఏర్పాటు చేశారు. శుభమస్తు ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించిన విషయం విదితమే. ఆర్భాటంగా ప్రారంభించారేగానీ దీన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఇటీవల ప్రచురించిన కథనంతో వైద్యాధికారులు స్పందించారు. కిడ్నీ డయాలసిస్‌కు అవసరమైన మందులు సమకూర్చుకుని శుక్రవారం సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13 : ఎస్సీ వర్గానికి చెందిన యువకులను విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిచి విచక్షణా రహితంగా కొట్టిన ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డి, కానిస్టేబుల్ సుమన్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆ ఎస్ఐ, కానిస్టేబుల్ దళిత యువకులను విచక్షణారహితంగా కొట్టి, వెంకటాచలం పోలీసులకు అప్పగించిన తీరుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు చేపట్టాలన్నారు. రెండు రోజుల్లో వారిపై చర్యలు తీసుకోకపోతే చలో ముత్తుకూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ వైస్ చైర్మన్ రేష్వంత్, పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్పీకి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం) : దళిత యువకులను విచక్షణారహితంగా కొట్టిన ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డి, కానిస్టేబుల్ సుమన్‌పై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు, బాధిత యువకుల కుటుంబసభ్యులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, మాజీ ఎస్సీఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు రఘు తదితరులు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు జిల్లా పోలీసు కార్యాలయం బయట ఆందోళన చేశారు. అకారణంగా దాడి చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు.

20న మెగా జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 13: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి సీ విజయవినీల్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి ఉద్యోగాలు కల్పిస్తాయని తెలిపారు. కాకుటూరులోని విక్రమ సింహపూరి విశ్వవిద్యాలయం, కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డ్ జెరాక్స్, బయోడేటా, సర్టిఫికెట్లు తీసుకురావాలని, పూర్తి వివరాలకు 9573482179, 6301529271, 9182799405 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

11 మంది బాలకార్మికులకు విముక్తి

● ఒడిశా నుంచి చెన్నైకు తరలిస్తుండగా సంరక్షణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13 : బాలలను అక్రమంగా కూలి పనులకు ఒడిశా నుంచి చెన్నైకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పలుశాఖల అధికారులు నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రైలును ఆపి 11 మందికి విముక్తి కలిగించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ మాట్లాడుతూ ఒడిశాకు చెందిన హికబడి, రాజభద్ర, అమూల్యభాయ్, ఆనందరావు, దేకాంకండ అనే వ్యక్తులు 11 మంది పిల్లలను చెన్నైలో సెంట్రింగ్ పనుల కోసం తరలిస్తున్నారని చెప్పారు. ఈ సమాచారంతో బాలల సంరక్షణ విభాగము, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బీబీఏ తదితర శాఖలు సంయుక్తంగా ఆర్‌పీఎఫ్ పోలీసుల సహకారంతో రైలును ఆపి బాలురకు విముక్తి కల్పించామన్నారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది కేసు నమోదు చేశారని, 11 మంది బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచామని తెలిపారు. క్యాప్‌లో ఐదుగురు, చిల్డ్రన్స్ హోంలో ఆరుగురిని చేర్పించామన్నారు. వారి తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకుని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సిబ్బంది శ్రీహరి, సతీష్, ప్రసాద్, బీబీఏ సిబ్బంది తిరుమలరావు, చంద్రశేఖర్, ఐసీపీఎస్ సిబ్బంది రత్నం, పావని, సమత, శైలజ పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి జాతీయ అవార్డు



అవార్డు అందుకున్న ఎస్ఈఐఎల్ ప్రతినిధులు

ముత్తుకూరు, సెప్టెంబరు 13 : ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీకి భారత పరిశ్రమల సమాఖ్య నుంచి ప్రతిష్టాత్మకమైన నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్ మెంట్-2024 దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం కంపెనీ సీఈవో రాఘవ్‌త్రివేది మాట్లాడుతూ ఎస్ఈఐఎస్ యొక్క ప్రాజెక్టు-1కి ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్‌గా విశిష్ట గుర్తింపు లభిం చిందన్నారు. ఈ అవార్డును గెలుచుకోవడం ఇంధన రంగంలో ఎస్ఈఐఎల్ నాయకత్వ దక్షత, విద్యుత్ ఉత్పత్తి, వినియోగ యాజమాన్యంలో శ్రేష్ఠత, అంకితభావానికి నిదర్శన మన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 25వ నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనే జ్‌మెంట్-2024 వేడుకలో కంపెనీ ఆపరేషన్స్ సపోర్టు అండ్ పెర్ఫార్మన్స్ మానిటరింగ్ హెడ్ నాగేశ్వర్‌రావు, డీజీఎం ఇంజనీరింగ్ శ్రీరామచంద్రమూర్తి, భువనగిరి ఏజీఎం నారా యణ బొడ్డు అవార్డును అందుకున్నారని తెలిపారు. కార్బన్ ఉద్గారాల తగ్గింపు కోసం మా సిబ్బంది నిబద్ధత, కార్యదీక్షతకు ఇది నిదర్శనమన్నారు. ఈ అవార్డు శక్తి నిర్వహణలో నూతన ఆవిష్కరణలు, శ్రేష్ఠతను కొనసాగించడానికి మమ్మల్ని ప్రేరేపిస్తుందన్నారు. పర్యావరణంపై సానుకూల ప్రభావం చూపే ప్రయత్నాలకు తాము కట్టుబడి ఉన్నామన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిందీ అక్షర ఆకారంలో విద్యార్థులు

అనంతసాగరం, సెప్టెంబరు 13: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ ఆకారంలో హిందీ ఉచ్ఛరించిన విద్యార్థులు చేసిన వరదన ఆకట్టుకొంది. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు మదీనా, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సుభిక్షానికి శాంతి హోమం


శాంతిహోమంలో టీడీపీ నేత మాలేపాటి

దగదర్తి (విడ్రగుంట) సెప్టెంబరు 13: తెలుగుదేశం పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు శివాలయంలో శుక్రవారం శాంతిహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేపర్ల కిశోర్ నాయుడు ఆధ్వర్యంలో లింగాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చక బృందం, టీడీపీ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కలిగిరి, సెప్టెంబరు 13: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17న నులిపురుగుల నివారణకు 1-19ఏళ్ల వయసు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులకు వైద్యసిబ్బంది అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం పీహెచ్‌సీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 13: తనపై ముగ్గురు దాడి చేసినట్టు శుక్రవారం స్థానిక కోర్టు న్యాయవాది లింగాలభైరన జయలక్ష్మి శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బుడంగుంట కాలనీలో ఉంటున్న జయలక్ష్మి ఆదేశాలలో గురువారం రాత్రి 11గంటల సమయంలో కోలాటం చూసి కుమారుడితో కలసి ఇంటికి నడుచు కుంటూ వెళుతుంది. మార్గమధ్యలో అదే ప్రాంతానికి చెందిన షేక్ మున్నా అలియాస్ కలీం, కర్రీ అలియాస్ సోని, నవ్వలు తమ కేసు వాదించమంటే వాదించనా అంటూ అసభ్యపదజాలంతో దూషించారు. అంతటితో ఆగక మున్నా ఇటుకరాయి తీసుకుని జయలక్ష్మి తలపై కొట్టాడు. కర్రీ, సోనిలు కొలాటం కర్రలతో దాడి చేశారు. స్థానికులు బాధితురాలిని 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ


వ్యాక్సినేషన్ నిల్వ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి భాదర్‌వలీ

సంగం, సెప్టెంబరు 13: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను అదనపు జిల్లా వైద్యాధికారి షేక్ భాదర్‌వలీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలో సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం బిసిజీ వ్యాక్సినేషన్, టీబీ రోగులకు అందజేస్తున్న మందుల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఆరోగ్య కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

సీతారామపురం, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి లావణ్య కోరారు. సీతారామపురంలోని సెక్టార్-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమ్మ, జాని, ఆదిలక్ష్మి, భవానీ, తదితరులు పాల్గొన్నారు. బరన్ ఉండే ఆహారం తీసుకోవాలి

●వరికుంటపాడు: గర్భిణులు, బాలింతలు బరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. పోలినేనిచెరువులో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సురేఖ, నవీనాయలు ఉద్యోగి సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, ఆమరజ్యోతి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

కావలి, సెప్టెంబరు 13: నిత్యం బిజీ జీవితం గడుపుతున్న ప్రజలకు కొంతసేపు మానసిక ప్రశాంతత అవసరమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు పోలీస్ క్వార్టర్స్ మైదానంలో జీవన్‌సాగర్ కంపెనీ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను శుక్రవారం రాత్రి కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కావలిలో ఎక్కడా ఆహ్లాదంగా కొంత సేపు గడపటానికి సరైన ప్రదేశం లేదన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్ మానసిక ఒత్తిడితో బిజీగా ఉన్న వారికి కొంత ప్రశాంతత కల్పించటం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కందుకూరు, సెప్టెంబరు 13: రానున్న వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పట్టణంలోని అన్ని కాలనీల్లో ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ అనూష సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని పలు శివారు ప్రాంతాల మురుగుకాలువల పరిస్థితులు, కచ్చా డ్రైన్లను పరిశీలించారు.

నేడు పాఠశాలలు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13: ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను శనివారం యథావిధిగా నిర్వహించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తుపాన్ కారణంగా పాఠశాలలకు సెలవు ఇచ్చారని, అందుకు బదులుగా రెండో శనివారం పనిదినంగా నిర్వహించాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారన్నారు.

శిథిలావస్థలో చెరువు తూము

● ఏటా నీటి ఇబ్బందులు ● రైతుల అవస్థలు


మరమ్మతులకు గురై పనిచేయని కొత్తపల్లి చెరువు తూము

అనంతసాగరం, సెప్టెంబరు 13: మండలంలోని కొత్తపల్లి చెరువు తూము శిథిలావస్థకు చేరుకుంది. తూముకు గతంలో ఏర్పాటుచేసిన చెక్క, కింద, పైకి లేవని పరిస్థితితో రైతులకు నీటి ఇబ్బందులు నెలకొన్నాయి. ఈచెరువుకు ఉత్తర కాలువతో పాటు వర్షంతో నీటి లభ్యత చేకూరుతోంది. అయితే తూముకు ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టి కొంతకాలంగా పనిచేయడం లేదు. చెక్క కొంచేమేరకు లేని ఉండడంతో చెరువుకు నీరు చేరిన సమయంలో నీటి నియంత్రణ లేకుండా జలాలు వృథాగా పోతున్నాయి. చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం చుక్క నీరు లేదు. తూము పనిచేయక పొలాలకు నీరు అందక ఏటా వరి పంట దెబ్బతింటోంది. తూముల మరమ్మతులు చేసేందుకు ప్రస్తుతం అనూకూల సమయంగా ఉంది. త్వరలో ఉత్తర కాలువకు నీరు ఇచ్చే సూచనలు ఉన్నందున ఆలోపు మరమ్మతులు పూర్తిచేయాలని కొత్తపల్లి మాజీ సర్పంచ్ చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, అన్నదాతలు కోరుతున్నారు.

వరద బాధితులకు టీడీపీ నేత ఆర్థికసాయం


మంత్రి ఆనంకు చెక్కును అందిస్తున్న వెంకటరామిరెడ్డి దంపతులు

ఏఎస్ పేట, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఆ నుమసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కైపు వెంకటరామిరెడ్డి ఆతని బార్య సుబాషిని రూ.25వేల చెక్కును శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అందించారు. దీంతో మంత్రి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిమి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ఇంటూరి


జక్కంపూడి కాలనీలో పర్యవేక్షిస్తున్న ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 13: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుడమేరు వరదలతో ముంపునకు గురైన విజయవాడ మండలం జక్కంపూడి కాలనీలో వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వరదనీరు, బురద తొలగింపు పనులు, బాధితులకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసు కుంటున్నారు. అలాగే ఇంటింటా నష్టం అంచనాలు వేస్తున్న ఎన్యూమ రేషన్ అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధితులందరికీ న్యాయం జరిగేలా ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక చొరవ తీసుకున్నారని టీడీపీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆయన కృషికి బాధితుల నుంచి కృతజ్ఞతలతో పాటు సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నుంచి ప్రశంసలు కూడా దక్కాయని తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీవో పద్మజ

వరికుంటపాడు, సెప్టెంబరు 13: మండలంలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కందుకూరు డీఎల్‌డీవో పద్మజ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులను సకాలంలో మంజూరు చేస్తుండడంతో రెండు నెలల్లో ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రత్యేకంగా అదనపు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం బోగ్యంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున, ఏపీవో ఆజమ్‌ఖాన్, వర్క్ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ


విచారణ చేపడుతున్న అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 13: మండలంలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ విచారణ చేపట్టారు. 566పనులకు రూ.15.67 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. బహిరంగ విచారణలో పనులకు సంబంధించిన ఫొటోలు లేకుండా కొంతల వ్యత్యాసం, కూలీలు గ్రామ్యయేత్ ఆయినా వారి పేరు మీద వేతనమిచ్చిన చేసి ఉండటం, ఒక ప్రదేశంలో కూలీలు చేసిన పనులను ఒకే జాబ్‌కార్డు పేరుమీద మరికొన్ని పనులను చేసినట్టు తదితర విషయాలను తనిఖీ సిబ్బంది గుర్తించారు. అన్ని గ్రామాల్లోను పనులు చేయకుండా నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్టు తేల్చారు. సామాజిక తనిఖీ బహిరంగ విచారణ కొనసాగుతుందని తుది నివేదిక వివరాలను వెల్లడిస్తామని అధికారులు తేల్చారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ విజయలక్ష్మి, సోషల్ ఆడిట్ స్టేట్ మేనేజర్ సునీల్‌కుమార్, ఎస్టీఎం పోలయ్య, డీఆర్‌పీ విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వేణుగోపాల్, ఏపీడీ గాయత్రిదేవి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ చెంచయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు, సెప్టెంబరు 13: నియోజకవర్గ టీడీపీ నేతలను మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పరామర్శించారు. ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు మాతృమూర్తి లక్ష్మమ్మ ఒంగోలులో గురువారం రాత్రి మృతిచెందారు. టీడీపీ పట్టణ మాజీఅధ్యక్షుడు కండ్రా మాల్యాద్రి తండ్రి సోమయ్య గురువారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. దీంతో పోతుల రామారావు శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నేతలు మాదవరావు, కండ్రా హరిబాబు, బెజవాడ ప్రసాద్, కండ్రా మాలకొండయ్య నల్లూరి వీరరాఘవులు ఉన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించాలి

● ఆర్డీవోకు దళితుల వినతి

కావలి, సెప్టెంబరు 13: సిరిపురం-నారాయణపురం మధ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వద్ద నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణంలో తమకు భాగస్వామ్యం కల్పించాలని ఎస్సీ ఎస్టీలు శుక్రవారం కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘర్షసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో యాదవులు నిర్మించే ఆలయంలో ఎస్సీ ఎస్టీలకు భాగస్వామ్యం కల్పించకుండా, తమదని ఆలయంలోకి రానివ్వమని చెప్తుతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకొల్లి వెంకటరావు, అలూరి బ్రహ్మయ్య, రమేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

వేజర్ల, సెప్టెంబరు 13: మండలంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులందరూ కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని వావిలేరు, మాముడూరు గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంకు బాలయ్యనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు గుండాల విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవను విజయవంతం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 13: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో బజాక్ ప్రదీప్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, పరిశుభ్రత కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●విడ్రగుంట: గ్రామ పంచాయతీలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వచ్ఛతాహీ సేవ పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు కార్యదర్శులను కోరారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ భవనంలో వారికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఐసోలార్ విస్తరణ అధికారి జహీర్ ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, సెప్టెంబరు 13: విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలను కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించటం మంచి కార్యక్రమం అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆయన విద్యుత్‌ప్రమాదాల నివారణ చర్యల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడారు. ప్రజలు తడిచేతులతో విద్యుత్ స్విచ్‌లను ఆన్, ఆఫ్ చేయరాదని, తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, పొలాల చుట్టూవేసే కంచకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదన్నారు. చేపల-రొయ్యల గుంటలు, చెరువుల చుట్టూ నేలపై విద్యుత్ వైర్లను వేయరాదని తదితర 16 జాగ్రత్తలను కరపత్రాలతో తెలియజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ కావలి ఈఈ జెన్నర్, ఐన్‌చార్జి డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ వసంతరావు, కుమర్లపల్ ఏఈ అనంతరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

లింగసముద్రం, సెప్టెంబరు 13: పెంట్రాల యూపీ పాఠశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 19మంది విద్యార్థులు చేరినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, నృత్యాలతో అలరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సుంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులంతా ఆధార్‌కార్డు, వ్యవసాయ భూమి వివరాలు అందజేసి ఈనెల 25వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, సీఈఓ లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ భవనంలో పీఏసీఎస్ మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో సభ్యులుగా ఉండి చనిపోయిన, పొలం లేని వారిని తొలగించడం జరుగుతుందన్నారు. సంఘం జమా ఖర్చుల పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. పేద దున్నాని రూ2 కోట్లకు పెంచుతూ బైలా తయారు చేయాల్సిందిగా తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నా దృష్టంతా నియోజకవర్గ అభివృద్ధిపైనే : ఎమ్మెల్యే కాకర్ల

● కమ్మవారిపాలెంలో కార్యకర్తలతో ముఖాముఖీ


పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబరు 13: జనంనుంచి తన దృష్టంతా నియోజకవర్గం అభివృద్ధిపైనే ఉంటుందని ఆ దిశగా తాను చర్యలు తీసుకుంటానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. గురువారం రాత్రి ఆయన కమ్మవారిపాలెంలో పర్యటించారు. గ్రామ టీడీపీ నేత కరియావుల అప్పలయ్యనాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామ పొలిమేరలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించారు. ఇప్పటివరకు వివిధ ఏ ఇబ్బంది వచ్చినా నిస్సంకోచంగా వచ్చి తనను కలవొచ్చని తెలిపారు. వైఎస్ వైసీపీ దురహంకార పాలనలో మీరు ఎంత నలిగిపోయారో, ఎన్ని అవమానాలు పొందారో, ఎంతెంత ఆస్తులు పోగొట్టుకున్నారో తనకు తెలుసునన్నారు. కార్యకర్తలందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత తనపైనే ఉందన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా కృషిచేయాలన్నారు. అభివృద్ధిలో వెనుకబడ్డ ఉదయగిరిని ముందంజకు తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త తనకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మదమోహన్‌రెడ్డి, కూటమి నేతలు బుజ్జరాఘవరెడ్డి, బాన్సురిరెడ్డి, తిరుమలరెడ్డి, మాల్యాద్రినాయుడు, శ్రీనాధరెడ్డి, ఎంపీపీ గోపిశాల వెంకటరమణయ్య, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు పొత్తూరి శైలజ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు

జలదంకి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. రోజువారీ ఓపీ వివరాలపై సిబ్బందిని ప్రశ్నించి రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు దర్శనమివ్వడంతో ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు మదమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు


ఆకర్షణీయంగా ముఖద్వారం

కావలి టౌన్, సెప్టెంబరు 13: పట్టణ కలుగోళ శాంబవి ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. వెలుగొత్తున భారీ సెట్టింగులతో అలంకరించిన విద్యుద్దీపాలంకరణ భక్తులను కనువిందు చేస్తుంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నవరాత్రులు సాయంత్రం 7గంటల నుంచి అర్చక బృందంతో దశ హారతులు ఇస్తున్నారు. సరస్వతీ, నవదుర్గ, రుద్రాభిషేకాలు, కాత్యాయని వ్రత పూజలు, లక్ష్మీ కుబేర పూజ, దక్షిణామూర్తిపూజలు, అష్టలక్ష్మి దేవతలకు కుంకుమ పూజలు చేస్తున్నారు. వరసిద్ధి స్వామి వారికి కల్యాణ మహోత్సవం పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవం

కావలి రూరల్, సెప్టెంబరు 13: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శుక్రవారం విగ్రహాల నిమజ్జనం చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం గణపయ్యను పూలతో అలంకరించిన వాహనాల్లో ఎక్కించి మేళ తాళాలు, డప్పువప్పుళ్లు, డీజే వాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగించారు. తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం తీర ప్రాంతాల్లో ఈ వేడుకలతో సందడి నెలకొంది.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు


ఉదయగిరి రూరల్: ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13: భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు వరదీన్‌బాషా, తిరుపతయ్య, షేక్ నాయబ్, గద్దం నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●గుడ్లూరు: సీపీఐ(ఎం) కమ్యూనిస్టు నాయకులు వామపక్షాల వెలుగురేఖ కామ్రేడ్ సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకుని పోరాటాలు కొనసాగించాలని గుడ్లూరు సీపీఎం మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దిశెట్టి జయయ్య, దామా కృష్ణయ్య, కొమరగిరి అంజయ్య, సుంకరి విజయలక్ష్మి, మేగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

●వింజమూరు: జోగోలు మండలం సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆసాది వెంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, కామ్రేడ్ కొమరం బుజ్జమ్మ, దమ్ము శంకరయ్య, బ్రహ్మయ్య, యానాదయ్య, పి.శ్రీనివాసులు, బాదుల్లా ఉన్నారు.

దేశ సమగ్రతకు క్రీడలు దోహదం : ఆర్డీవో

● విట్స్‌లో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ ప్రారంభం


క్రీడాజ్యోతిని అందిస్తున్న ఆర్డీవో శీనానాయక్

కావలిటౌన్, సెప్టెంబరు 13: దేశ సమగ్రతకు క్రీడలు దోహదం చేస్తాయని ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. గురువారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వకర్మ 2కె 24వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విట్స్ చైర్మన్ డొడ్ల విద్యాధర్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో మూడురోజులు జరుగనున్న వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో ముందుగా క్రీడా జ్యోతి వెలిగించి క్రీడాకారుడికి అందజేశారు. కావలిలో రాష్ట్రస్థాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో క్రీడల పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. విశ్వోదయ రెక్టార్ డొడ్ల విజయ్‌కుమార్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సిపల్ శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్, శ్రీనాథ్, పీడీలు భాస్కర్, జోసెఫ్, ఏడుకొండలు, ఆర్.మాల్యాద్రి పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టులో

కోళ్ల వ్యర్థాలు వేయడం అవాస్తవం

లింగసముద్రం, సెప్టెంబరు 13: సాగు, తాగు నీటికి చెందిన రాళ్లపాడు ప్రాజెక్టులో కోళ్ల వ్యర్థాలను వేస్తున్నామనడంలో వాస్తవం లేదని పెదపవని మత్స్యకార సొసైటీ నాయకులు రమణయ్య, ఒంగూరు శ్రీనులు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం వారు లింగసముద్రంలో మాట్లాడారు. రాళ్లపాడు రిజర్వాయర్‌లో చేపలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ పూర్వీకుల నుంచి ప్రాజెక్టును నమ్ముకుని జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తమ సొసైటీలో 180 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని లేకపోతే మత్స్యకారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మల్లికార్జున, ఏడుకొండలు, శ్రీనివాసులు, వెంకటేష్, రమణయ్య, వెంగయ్య, హనుమంతు, సింహాద్రి పాల్గొన్నారు.

రామన్నచెరువులో ఆక్రమణలు తొలగించండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ


ఆక్రమణలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వలేటివారిపాలెం: స్థానిక రామన్నచెరువులో ఆక్రమణలను వెంటనే తొలగించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలో రామన్న చెరువు అన్న ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించి చెరువు ఆక్రమణలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతంను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే చెరువును సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో నరేంద్ర ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నర్రవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట సుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో బుచ్చి చైర్‌పర్సన్ భేటీ

● కౌన్సిలర్లతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 13: బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మురళి దంపతులు, పలువురు కౌన్సిలర్లకు శుక్రవారం నెల్లూరులోని మాగుంట లేఔట్‌లోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో ఆమెతో భేటీ అయ్యారు. వారితో పాటు కౌన్సిలర్లు ఎరటపల్లి శివకుమార్‌రెడ్డి, చీర్ల ప్రసాద్‌యాదవ్, రాచూరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు. నగర పంచాయతీ అభివృద్ధిపై చర్చించారు. వీరంతా త్వరలోనే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరనున్నారు. వారి వెంట టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, కోడూరు కమలాకర్‌రెడ్డి ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

కొడవలూరు, సెప్టెంబరు 13 : కోవూరు నియోజకవర్గంలో పేదల ఆర్థికాభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని యల్లయపాళెం గ్రామం నుంచి నెల్లూరుకు కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం ఆమె యల్లయపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యల్లయపాళెం గ్రామానికి 9 ఏళ్ల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. అలాగే శనివారం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్స్ హాల్‌లో జరిగే జాబ్‌మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిశీలకుడు మూంగమూరి శ్రీహరి రెడ్డి, నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, ఏకొల్లు వంశీధర్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు, భూలోకం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'డీకేడబ్ల్యూ' చేయూత



వస్తువులు సేకరించిన డీకే కళాశాల విద్యార్థినులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13 : వీఎస్‌యూ జాతీయ సేవా పథకం వారి ఆదేశాల మేరకు నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల సహకారంతో విజయవాడ వరద బాధితులకు వస్తువులు సేకరించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, కళాశాల ఎన్‌ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వై దివ్య, మనోజ్, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



జనసేన నేత సురేష్‌నాయుడికి చెక్కు అందజేస్తున్న వాణిభవాని, ఆమె తల్లి దేవి

● **వెంకటాచలం :** సర్వేపల్లి జనసేన పార్టీ చేపట్టిన 'నేను సైతం వరద బాధితులకు అండగా' కార్యక్రమంలో భాగంగా సర్వే పల్లి జనసేనపార్టీ మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణిభవాని తల్లి దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని రూ.10 వేల ఏటాయించారు. శుక్ర వారం ఆ చెక్కును సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడికి అందజేశారు.

నేడు ‘వీపీఆర్’లో జాబ్ మేళా

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 : నగరంలో గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో శనివారం కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నిరు ద్యోగ యువత కోసం ప్రత్యేకంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా మొదలవుతుంది. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఇందులో పాల్గొనవచ్చు. దేశ వ్యాప్తంగా ఉన్న 32 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయి. ఉద్యోగాలకు ఎంపికైన వారికి శనివారమే నియామకపు పత్రాలు కూడా ఇస్తారు. కోవూరు నియోజకవర్గ నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ మేళాకు ఇప్పటి వరకు ఆ నియోజకవర్గం నుంచి 1500 మంది, నెల్లూరు నగరం నుంచి మరో 600 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్టర్ చేసుకోని వారు కూడా శనివారం నేరుగా వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు వచ్చి రిజిస్టర్ చేసుకునే ఏర్పాటు చేశారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో కూడిన 8 సెట్లు తీసుకురావాలని, ఈ విధంగా 8 సెట్లు ఇవ్వడం వల్ల ఏదో ఒక కంపెనీలో ఉద్యోగం కల్పించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

భక్తుల తాగునీటి సమస్య పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 13: మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆర్‌ఓ ప్లాంటు మరమ్మతులకు గురై 3 నెలలు నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్న భక్తుల సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయ్యింది. మోటారు మరమ్మతులకు గురైన విషయాన్ని వారం రోజుల క్రితం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వీపీఆర్ ట్రస్టు ద్వారా దానిని మరమ్మతులు చేయించడంతో భక్తులకు తాగునీటి సమస్య తీరింది.

కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన

జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారికి ఆలయం చుట్టూ పల్లకిసేవ నిర్వహించారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం జరిగింది. కార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

'రత్నం' విద్యార్థికి గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డ్



నెల్లూరు (విద్య) : ఏసీ నగర్ రత్నం పాఠశాలకు చెందిన జీవీఎస్ దీక్షిత చౌదరి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుందని పాఠశాల డైరెక్టర్ కే వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభి నందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాశీలో జరిగిన ఐసీ ఎండీఏ కూచిపూడి నృత్యం సీనియర్ విభాగంలో తమ విద్యార్థిని నాట్య ప్రదర్శన చేసి గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించడం గర్వ కారణమన్నారు. అనంతరం విద్యార్థినిని సత్క రించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, విద్యా ర్థిని తల్లిదండ్రులు లక్ష్మీదివ్యశ్రీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడి హుండీ ఆదాయం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయం లో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. రెండు నెలల 25రోజులు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.5,07,081 ఆదాయం వచ్చింది. లెక్కింపు కార్యక్రమంలో వెంగమాంబ ఆలయ ఈవో ఉష, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణేశా ఏమి నీ దుస్థితి..!



పెన్నా నీటిలో విఘ్నేశ్వర ప్రతిమలు

వినాయక చవితికి నగరంలో భారీ సంఖ్యలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి వైభవంగా ఉత్సవాలు జరిపారు. ఆ తర్వాత శోభాయాత్రలు, తప్పెట్లు, తాళాలు, గంగ హారతులు.. అంటూ సామూహిక గణేశ నిమజ్జనను జాతరలా నిర్వహించారు. కానీ నిమజ్జన ప్రదేశాల్లో తగినంత నీటి నిల్వ లేక వినాయకుడి విగ్రహాలు పూర్తిగా మునగలేదు. గణనాథుడు గట్టిగా ఒక్క మునక కూడా వేయని దుస్థితి నెలకొంది. స్వర్ణాల చెరువులోని గణేష్ ఘాట్‌లో నిమజ్జనం చేసిన లంబోదరుడి ప్రతిమ లు నీటి కొరతతో తేలుతున్నాయి. పెన్నా నది నీటిలోనూ ఇదే పరిస్థితి. గణేష్ నిమజ్జనం కోసం రూ.2కోట్లకుపైగా ప్రజల సొమ్ముతో నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేసింది. కానీ నిమజ్జనానికి కావలసి నంత నీటి నిల్వ చేయడాన్ని మాత్రం విస్మరించింది. సగం, పాతిక భాగం మునిగిన విగ్రహాలను చూసి భక్తులు ఆవేదన చెందుతున్నారు. తగినంత నీటిని విడుదల చేసి విగ్రహాలన్నీ మునిగేలా చర్యలు తీసుకోలేని పాలకులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



గణేష్ ఘాట్‌లో తగినంత నీరులేక మునగని గణనాథుని విగ్రహాలు

గణపతి మహాలడ్డు లక్కీడిప్ విజేత సునీల్

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా వేదాయపాళెంలోని వేద గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహాగణపతికి నివేదించిన 516కేజీల మహాలడ్డుకు శుక్రవారం రాత్రి లక్కీడిప్ జరిగింది. ఈ లడ్డూ సామాన్యులకు దక్కాలన్న ఉద్దేశంతో నిర్వాహకులు వేలంపాట నిర్వహించకుండా లక్కీడిప్ విధానాన్ని అమ లు చేశారు. రూ.100 చొప్పున లక్కీ కూపన్లు విక్రయించారు. 4వేలకుపైగా కూపన్లను భక్తులు కొనుగోలు చేశారు. వాటిని శుక్రవారం రాత్రి డ్రా తీశారు. నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌కు చెందిన సునీల్ విజేతగా నిలిచి లడ్డూను సొంతం చేసుకున్నారు. లక్కీడిప్ డ్రాకు ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పాతుగుంట వెంకట రమణయ్య నాయుడు, వైకుంఠం కనకరాజు హాజరయ్యారు. కాగా, శుక్రవారం మహా గణపతికి విశేష పూజలు, వేద గణపతికి ముత్యాలతో అలంకారం జరిగాయి. ఇక్కడ స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన 25కేజీల లడ్డూకు ఆదివారం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రకటించింది.

రావణబ్రహ్మ వాహన అలంకారంలో జ్యోతి వినాయకుడు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 13 : నగరంలోని పురమందిరం జ్యోతివినాయక మందిరంలో చవితి బ్రహ్మోత్సవాలు 7వరోజుకి చేరాయి. శుక్రవారం ఉదయం, సాయంత్రం విశేష పూజలు జరిగాయి. మూలవర్లకు వెన్న అలంకారం జరిగింది. రాత్రి రావణబ్రహ్మ వాహన అలంకారంలో జ్యోతి వినాయకస్వామికి నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గూగుల్ డెవలపర్ గ్రూపునకు నాగసాత్విక్ ఎంపిక

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి ఆర్ నాగసాత్విక్ గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ లీడ్‌గా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన ఈక్లబ్ ద్వారా కోడింగ్ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. కోడింగ్ ఆవశ్యకతను గుర్తించి ఉన్నతంగా రాణించాలని విద్యార్థినికి సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ, సీఎస్‌ఈ హెడ్ డాక్టర్ సీ రాజేంద్ర, కోడింగ్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ సీ రామమోహన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) : భక్తవత్సలనగర్ పెన్షన్ భవన్‌లో ఆదివారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగుల సర్వసభ సమావేశం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్స్‌డే వేడుకలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

17 నుంచి నులి పురుగుల నివారణ కార్యక్రమం

ఇందుకూరుపేట, సెప్టెంబరు 13 : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 సచివాలయాల్లో ఈనెల 17వ తేదీ నుంచి జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పీహెచ్‌సీలో గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డీవార్మింగ్ విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, 104 వైద్య సిబ్బంది లక్ష్మణ్, సుల్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ మూకల దాడికి కులాలను అంటగట్టొద్దు

● కాకాణికి తెలుగుయువత నేత రాజేంద్ర హితవు

వెంకటాచలం, సెప్టెంబరు 13 : రౌడీమూకల దాడిలో తీవ్రంగా గాయపడ్డ బెల్లంకొండ వేణు ఫిర్యాదు మేరకు పోలీసులు క్షేత్రస్థాయిలో విచారించి కేసు నమోదు చేస్తే దానిపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కులాలను ఆపాదించి బురదజల్లే ప్రయత్నం చేయడం దారుణమని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి యామల రాజేంద్ర హితవు పలికారు. మండలంలోని మొలకలపూడికి చెందిన వేణు, వారి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన వెంకటాచలంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా కులాల ప్రస్తావనతో కాకాణి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం మంచిది కాదన్నారు. వైసీపీ హయాంలో ఉదయగిరి నారాయణ అనే దళితుడిని, ఉస్మాన్, షాజహాన్‌లను దారుణంగా కొట్టి చంపినప్పుడు కాకాణి ఏమయ్యాడని ప్రశ్నించారు. వారి కోసం పోరాడిన ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బాధితుడు వేణు మాట్లాడుతూ ముత్తుకూరుకు చెందిన హరీష్‌తో వ్యక్తిగత కారణాల రీత్యా తనకు ప్రాణహాని ఉందని, అతని నుంచి రక్షణ కల్పించాలని కోరారు. మూడు రోజుల కిందట తాను తన ఇద్దరి పిల్లలతో కలిసి మొలకలపూడి రోడ్డులో ఉండగా హరీష్, మరో ఐదురురితో కలిసి వచ్చి తనను తీవ్రం కొట్టి తన ఇద్దరి పిల్లలపై దాడి చేశారని వాపోయాడు. గూడ్లూరువారిపాళెం పంచాయతీ వెంకటరెడ్డిపాళెంకు చెందిన దళిత యువకుడు నాని మాట్లాడుతూ హరీష్ గ్యాంగ్ తనపై కూడా దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

నైపుణ్యాల ప్రాధాన్యతపై చర్చ

వెంకటాచలం, సెప్టెంబరు 13 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావును డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్మెంట్ డాక్టర్ కేవీ స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధన విధానాలు, నైపుణ్యాలపై ఉన్న ప్రాధాన్యత గురించి చర్చించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ సాధించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులున్నారు.

● లేటరల్ ఎంట్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

విక్రమ సింహపురి యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నాలుగేళ్ల హనర్స్ విత్ రిసర్చ్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు పీజీ రెండవ సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ద్వారా చేరడానికి అర్హులని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ జిరాక్స్ కాపీలను తీసుకొని వర్సిటీలోని అడ్మిషన్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 20వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆలయానికి ఇనుపగేట్ల ఏర్పాటు

మనుబోలు: మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ ఆలయానికి చాట్ల వెంకటసుబ్బయ్య, సామ్రాజ్యమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శేషగిరిరావు, హరగోపాల్, సుబ్రమణ్యంలు రూ.లక్ష విలువచేసే ఇనుపగేట్లు శుక్రవారం అందజేశారు. మనుబోలమ్మ, నాగార్పమ్మ ఆలయాల ప్రధాన ద్వారంకు అనుబంధంగా ఈ ఇనుప గేట్లను అమర్చారు.

నేడు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జీవీ చలపతి శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు శనివారం ఉదయం 8 గంటలకు స్టేడియంలో పోటీలకు హాజరు కావాలని కోరారు.

దళిత యువకులపై సర్పంచు కుమారుల దాడి

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 13: పాత కక్షల నేపథ్యంలో మండలంలోని చింతోపులో దళితుల ఇళ్లల్లోకి జొరబడి గ్రామ సర్పంచు కుమారులు దాడి చేశారు. బాధితుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన కొందరు యువకులు రెండు రోజుల క్రితం గ్రామంలో క్రికెట్ ఆడుకొంటుండగా వైసీపీకి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఆ కక్షల నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున సర్పంచు కుమారులు బాలాజీ, మహేష్, వారి అనుచరులు దళితుల ఇళ్లల్లోకి జొరబడి దళిత యువకులు మనుబోలు చంద్రశేఖర్, పచ్చు ప్రత్యూష్‌పై దాడి చేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి గ్రామంలో గొడవలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

● వారి అరాచకాలు అరికట్టండి

గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటికీ దళితులపై దాడులకు పాల్పడుతున్న చింతోపు గ్రామ సర్పంచి కుటుంబీకుల అరాచకాలను అడ్డుకోవాలని టీడీపీ దళిత నాయకులు కోటేశ్వరరావు, ప్రవీణ్, భాస్కర్, చంద్రశేఖర్, ఏడుకొండలు, తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచు కుమారులు బాలాజీ, మహేష్‌లు మరణాయుధాలతో దళితుల ఇళ్లపై దాడులు చేశారని, గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనేక దాడులు చేసినప్పటికీ అదేతంతు కొనసాగిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నగరంలోని ఆర్‌ఎం కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎంఆర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 300 మంది ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని, వారికి ఇచ్చే ఈపీఎస్ 95 స్కీమ్ పెన్షన్ సంవత్సరాలు గడుస్తున్నా ముంజూరు కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెన్షన్ అందించేలా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.9 వేలు పెన్షన్‌తోపాటు కరువు భత్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీపీ నరసింహారెడ్డి, టీ రామసుబ్బయ్య, పీవీజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి: బీజేపీ కిసాన్‌మోర్చా



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 13: వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. మోర్చా జాతీయ ఉపాధ్య క్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ప్రకృతి వైపరిత్యాలు, తెగుళ్లతో నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు నాలుగు పుట్లు పండాల్సిన వరి పంట, చేతికి వచ్చేసరికి రెండు పుట్లే ఉంటోందన్నారు. పుట్టి రూ.23,000కు కొనుగోలు చేయాల్సి ఉండగా అమాంతం రూ.6 వేలు తగ్గించి మిల్లర్లు రైతులను నిలువునా ముంచుతు న్నారని ఆరోపించారు. ప్రభుత్వ మద్దతు ధరకు కూడా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు బోరుమంటున్నారన్నారు. వారిని ఆదుకోవాలని ప్రభుత్వం, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేమారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, చేవూరి వినయ్‌నారాయణ, కుప్పా ప్రసాద్, వీ హర్షవర్ధన్, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీసు వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్‌డే నిర్వహించారు. జిల్లాలోని పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 36 మంది సిబ్బంది వారి సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

వైసీపీలో సర్పంచులకు గౌరవంలేదు : రూరల్ ఎమ్మెల్యే



సర్పంచును కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 13 : వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వలేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో సజ్జాపురం సర్పంచ్ అప్పుకూటి నారాయణ, ఉపసర్పంచ్ సూరేపల్లి కొండయ్య, వార్డు సభ్యులను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఏపీలో స్థానిక సంస్థలకు విధులు, నిధులు కేటాయించి తగిన గౌరవం ఇచ్చిన పార్టీ టీడీపీ ఒక్కటేనన్నారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, నగరంలోని 38వ డివిజన్ శోధన్‌నగర్‌లో మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వనం - మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటారు. వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేం దుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు వారి పూర్వీకులు, తలిదండ్రుల పేరిట మొక్క నాటి పరిరక్షించాలని కోరారు.

వేదగిరి హుండీ ఆదాయం రూ. 12.69 లక్షలు



నెల్లూరు రూరల్, సెప్టెంబరు 13 : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. 110 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా ఆదాయం రూ. 12.96 లక్షలు సమకూరినట్లు ఈవో ఎం సుధీర్ తెలిపారు. అన్నదానానికి అదనంగా రూ.28,207లు వచ్చిందని పేర్కొన్నారు.

వెల్లంటిలో ఏచూరికి ఘననివాళి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం మండలంలోని వెల్లంటి గ్రామంలో ఘన నివాళి అర్పించారు. సీపీఎం స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. పోరాటాలకు స్ఫూర్తినిచ్చే ఏచూరి గొంతుక మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన లేనిలోటు పార్టీకి తీవ్రనష్టమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూడిపర్తి జనార్దన్, పీ సుబ్రహ్మణ్యం, వనం రామచంద్రయ్య, పాదర్తి మస్తానయ్య పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణంపై విజిలెన్స్ విచారణ



వరిగొండలో విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 13 : మండలంలోని వరిగొండలో జగనన్న గృహ నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై శుక్రవారం విజిలెన్స్ అధికారు లు విచారణ చేపట్టారు. గృహ నిర్మాణాల్లో అవకతవకలు, నిర్మాణాలు చేప ట్టకనే బిల్లుల చెల్లింపులు ఇతర విషయాలపై విజిలెన్స్ డీఈ మహిత, ఏఈ అవినాష్‌రెడ్డి బృందం సమగ్ర విచారణ చేపట్టారు. ఈ గ్రామంలో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ల కోసం 13.35 ఎకరాల భూమి సేకరించి 525 ప్లాట్లు వేశారు. అందులో 300 ప్లాట్లు ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదు. గృహ నిర్మాణాలు పూర్తి చేయకపోవడం, బేస్ మట్టం పనులు నాసిరకంగా చేపట్టడంతో రూ.కోట్లలో అవినీతి జరిగిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఫిర్యాదు చేశారు. సీఎం ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు బాధితులతో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.30వేల నుంచి రూ.70వేల వరకు కాంట్రాక్టర్లు వసూలు చేశారని అధికారులకు వివరించారు. సమగ్ర నివేదిక ప్రభుత్వానికి నివేదిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. వారి వెంట స్థానిక టీడీపీ నేతలు కోడూరు శ్రీనివాసులురెడ్డి (చినబాబురెడ్డి), కర్పూరం శ్రీనివాసులురెడ్డి, గ్రామ ఉపసర్పంచు జలదంకి హరికృష్ణరెడ్డి, ఉన్నారు.

విద్యాలయాల్లో హిందీ భాషా దినోత్సవం

నెల్లూరు (విద్య) : హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నగరంలోని విద్యాలయాల్లో నిర్వహించారు. డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు హిందీ భాష గొప్పతనాన్ని, చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్ జైన్, హిందీ విభాగాధిపతి డాక్టర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


● నవాబుపేట చిన్నబాలయ్య నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జాస్మినమ్మ, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజుల సుభద్రాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

మనుబోలు, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి బాధాకరమని సీపీఎం జిల్లా నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం, నాయకులు బీసీ భాస్కర్, మాసు వెంకటేశ్వర్లు, జోగి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వరుస చోరీలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 13 : మండలంలోని పెనుబల్లి, పంచేడు, మినగల్లు, కాగులపాడు గ్రామాల్లో గత మూడు రోజులుగా జరుగుతున్న వరస చోరీలకు పాల్పడుతూ పొలాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, స్టాటర్లు, పలు ఇళ్లలో గొర్రెలు, పొట్టేళ్లను అపహరించు కెళుతుండడం ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. శుక్రవారం వేకువజామున పంచేడు పొలాల్లో మోటార్లు, స్టాటర్ల చోరీలు చేశారు. మోటార్లు పగలగొట్టి అందులో వైండింగ్ వైరు, కొన్ని సబ్‌మర్సిబుల్ మోటార్లకు అమర్చిన 200 అడుగులకు పైబడిన విద్యుత్ వైర్లు తెంచేసి అందులోని రాగి వైర్లు అపహరించుకెళ్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. పెనుబల్లికి చెందిన కౌలురైతు గుమ్మా మురళి కొన్ని మోటార్లు తెచ్చి గ్రామంలోని ఓ భవనంలో భద్రపరచాడు. దొంగలు ఆ మోటార్లను కూడా చోరీ చేశారు. అలా గే దాసరి మస్తాన్, కరిముల్లా, వాకాటి సురేంద్రరెడ్డి, కీలుకుప్ప దయాకర్‌లకు చెందిన మోటార్లు, స్టాటర్లు, పొట్టేళ్ల చోరీకి గురయ్యాయి. ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని బాధిత రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పొలాల్లో కాపలా కాస్తున్నారు.



ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవ మూర్తికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూర్ణహారతి సమర్పించాక భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగించారు.

- శ్రీకాళహస్తి



ఎంఎస్ విగ్రహం పునఃప్రతిష్ఠ

ప్రఖ్యాత సంగీత సామ్రాజ్ఞి, దివంగత ఎం.ఎస్.సుబ్బలక్ష్మి విగ్రహాన్ని శుక్రవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీప పూర్ణకుంభం కూడలిలో పునఃప్రతిష్ఠించారు. శ్రీనివాససేతు నిర్మాణంలో భాగంగా గతంలో ఆమె విగ్రహాన్ని తొలగించిన విషయం తెలిసిందే. టీటీడీ, నగరపాలక సంస్థ సహకారంతో ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. గాత్ర విభాగాధిపతి శబరి గిరీశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్

ఆర్టీవోగా బాధ్యతల స్వీకరణ



తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారిగా మురళీమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వచ్చారు. శ్రీవారి పాదాల చెంత విధులు నిర్వహిస్తుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఏఎంవీఐ స్వర్ణలత, ఏవోలు, సిబ్బంది ఆయన్ను అభినందించారు.

- తిరుపతి (జీవకోన)

పీజీ కోర్సులకు విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 13: ఎస్వీయూలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి విశేష స్పందన లభిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి దశ అడ్మిషన్లలోనే ఆర్ట్స్‌లో 68 శాతం, సైన్స్‌లో 64 శాతం, కామర్స్‌లో 57 శాతం సీట్లు భర్తీ అయ్యాయని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 20 శాతం సీట్లు తొలి దశ అడ్మిషన్లలో ఎక్కువగా ప్రవేశాలు పొందినట్టు తెలిపారు.



ప్రమాదాలకు పేరుగాంచిన మొగిలి ఘాట్ రోడ్డు ఈసారి ఏడుగురిని బలి తీసుకుంది. ఆర్టీసీ బస్సును అదుపు తప్పిన ఐరన్ లోడ్ లారీ ఢీ కొట్టడం.. వెనుక నుంచి గ్రానైట్ లోడ్‌తో వస్తున్న మరో లారీ ఢీకొనడంతో బస్సు నుజ్జునుజ్జయింది. తిరుమల దర్శనం తర్వాత సొంత ప్రాంతాలకు బస్సులో బయల్దేరిన వారిలో కొందరు అర్ధాంతరంగా తనువు చాలించారు. 31మంది క్షతగాత్రులుగా మిగిలారు.

మొగిలి ఘాట్‌లో మరణ మృదంగం

హన్సిక మృతదేహాన్ని తరలిస్తున్న మొగిలివాసి గోపి

ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్,ఎస్పీ, జేసీ

- రెండు లారీల మధ్య నుజ్జయిన ఆర్టీసీ బస్సు
- బస్సు, లారీ డ్రైవర్, ఐదుగురు ప్రయాణికుల దుర్మరణం
- సీఎం చంద్రబాబు, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- 31మందికి గాయాలు

బంగారుపాళ్యం/చిత్తూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం 3గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి ఐరన్ లోడ్‌తో వస్తోన్న 20 టైర్ల లారీ మొగిలి ఘాట్‌లో అదుపు తప్పింది. డివైడర్ దాటి పక్క రోడ్డులోకి వెళ్లిపోయి తిరుమల నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగాన వేగంగా ఢీకొంది. దీంతో బస్సు ఒక్కసారిగా వెనుదిరిగింది. అదే సమయంలో ఆ బస్సు వెనుక వస్తున్న గ్రానైట్ లోడ్ లారీ బస్సును మరోసారి ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఐరన్ లోడ్ లారీ డ్రైవర్, బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఇద్దరితో పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృత్యువాత పడగా 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం 31మంది గాయపడగా వీరిలో గ్రానైట్ లారీలోని వారు ముగ్గురున్నారు.వీరందరినీ తొలుత పలమనేరు ఏరియా ఆస్పత్రికి పంపించి చికిత్స అందించాక ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఈ ప్రమాద కారణంగా రెండు లారీలు, ఓ బస్సు రోడ్డు మీద ఉండిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఓ వైపునకు మళ్లించారు.

సహాయక చర్యల్లో స్థానికులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్ మనోహర్ సీటులో నుంచి ఎగిరిపడి లారీ కమ్మీల మధ్య చిక్కుకుని మృతి చెందారు.సీట్ల మధ్యలో ఇరుక్కుపోయిన కండక్టర్ చిరంజీవిని వెలికి తీయడానికి సుమారు గంట పట్టింది. గునపాలతో, రాడ్లతో నిగ్గదీసి స్థానికులు, అధికారులు ఆయన్ను వెలికితీసి 108 అంబులెన్స్‌లో చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పూతలపట్టు మండలంలోని చిటిపిరాళ్ల గ్రామం ఈయన సొంతూరు. ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతదేహం కమ్మీల కింద ఇరుక్కోవడంతో పోలీసులు, స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో కమ్మీలను పక్కకు జరిపి వెలికితీశారు. బస్సులో నుంచి కింద ఎగిరిపడ్డ ఓ బాలుడి మృతదేహాన్ని మొగిలికి చెందిన గోపి రెండు చేతుల్లో తీసుకుని అంబులెన్సులోకి ఎక్కించారు. మొగిలిలోని శ్రీని ఫుడ్స్ ఫ్యాక్టరీ మేనేజర్ తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఏడు మృతదేహాలను వెలికితీసి ఆస్పత్రికి తరలించడానికి సుమారు గంటన్నర సమయం పట్టింది.

మృతుల వివరాలు

- మనోహరన్ (56), తిరుపతిలోని అలిపిరి ఆర్టీసీ డిపో డ్రైవర్. తిరుపతిలోని సత్యనారాయణపురం నివాస ప్రాంతం.
- సోనుకుమార్ (31), ఐరన్ లోడ్‌తో వచ్చి ఢీకొన్న 20 టైర్ల లారీ డ్రైవర్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా ఖరిద్ ఖాజీపూర్ ప్రాంతం
- హన్సిక యాదవ్ (6), మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన అమ్మాయి. బస్సులో ప్రయాణిస్తోంది.
- బాలరాజు (55), తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాకు చెందిన వ్యక్తి
- విజయమ్మ (53), కంబాలమిట్ట,కావలివారి పల్లె పంచాయతీ, పాకాల మండలం. బెంగళూరులో వుంటోన్న కుమార్తె వద్దకు బస్సులో వెళుతోంది.
- శంకరరెడ్డి (50), ఎస్ఎస్ కొండ, జీడీనెల్లూరు మండలం
- కులసాంబి(55), టిన్‌ఫ్యాక్టరీ, బెంగళూరుకు చెందిన మహిళ.

క్షతగాత్రుల వివరాలు

పలమనేరు, సెప్టెంబరు 13 : మొగిలిఘాట్ ప్రమాదంలో 31 మంది గాయపడ్డారు. వీరిలో 20 మంది తీవ్రంగా గాయపడగా 11మంది స్వల్పంగా గాయపడ్డారు.క్షతగాత్రులైన శివ(27), రిక్కి(36), చిరంజీవి(45), బాబురెడ్డి(45), మురళి(35), అస్మిత్‌యాదవ్(3), పద్మావతి(54), లావణ్య(23), జి. అమరనాథ్(40), మంజు(50), సక్కుబాయ్(73), విష్ణు(29), కళ్యాణ్(26), సీహెచ్ వెంకటేశ్(35), ఎ.ఎన్. శ్రీనివాస్(6), శ్రీధర్(48), రుతిక్ (7), నేతాజి(33), వెంకటరమణ (24), ఎ. అక్రమ్(28), ముబారక్(27), కృష్ణ(38), జాస్మిన్‌మాలతి(33), బేబీ ఆఫ్‌జాస్మిన్ మాలతి(2), సురేష్(5), రితిక(44), రక్షిత(15), చిరంజీవి(36), విష్ణు(25), భాస్కర్‌రెడ్డి(55), ప్రశాంత్‌కుమార్(45)లను చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.వీరిలో ప్రాథమిక చికిత్సానంతరం ఆందోళనకరంగా ఉన్న 8 మంది శివ, రిక్కి, చిరంజీవి, బాబురెడ్డి,మురళి, అస్మిత్‌యాదవ్, పద్మావతి, లావణ్యలను తదుపరి చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం

సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు తెలుసుకుని మృతుల కుటుంబాలకు సంతా పం తెలిపారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

● లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ డ్రైవర్ సోనుకుమార్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనుకుమార్‌కు మొగిలి ఘాట్ మీద అవగాహన లేకపోవడంతో పాటు నిద్రమత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. లారీ అదుపు తప్పడంతోనే డివైడర్ దాటి మరీ అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఆ డ్రైవర్ నిర్లక్ష్యం అతనితో పాటు మరో ఆరుగురి ప్రాణాలు బలి తీసుకుంది. చాలామందిని క్షతగాత్రుల్ని చేసింది.



కుమార్తె దగ్గరకు వెళుతూ మృతి చెందిన పాకాలవాసి విజయమ్మ (ఫైల్ ఫొటో)

కూతురు చనిపోయిందని తెలియకనే

మహారాష్ట్రలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన ఆరేళ్ల హన్సిక ప్రమాదస్థలంలోనే చనిపోయింది.తల్లిదండ్రులు రిక్కీ, అషతోష్,మూడేళ్ల తమ్ముడు అష్మిత్ యాదవ్‌లతో కలిసి బస్సులో ప్రయాణించిన ఆమె మృతదేహం ఇప్పుడు చిత్తూరు ఆస్పత్రిలోని మార్చు రీ ల
ఉంది.ముగ్గురు కుటుంబ సభ్యులకు ఆమె చనిపోయిన విషయాన్ని చెప్పకుండా అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



అషతోష్‌ను ఓదారుస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



బాలుడు దొరికాడు

● 24 గంటల్లో కేసు ఛేదించి.. తల్లి ఒడికి చేర్చిన ఈస్ట్ పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: తిరుపతిలో బుధవారం రాత్రి తండ్రి నుంచి అదృశ్యమైన 18 నెలల బాలుడు దొరికాడు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని దుస్తుల దుకాణం వద్దనున్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఈస్ట్ పోలీసులు విచారించారు. పూల వ్యాపారి వద్దనున్న బాలుడిని శుక్రవారం తల్లి ఒడికి చేర్చారు. ఈ వివరాలను తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ మీడియా వెల్లడించారు. ఆ ప్రకారం.. నేపాల్‌కు చెందిన ఎల్‌కైలాస్, మనీషా దంపతులు ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. పద్మావతిపురంలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మ్యాన్‌గా ఉంటున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తన కుమారుడు బాలాజీకి దుస్తులు, ఇతర వస్తువులు కొనివ్వాలని ఇంటి నుంచి తీసుకొచ్చాడు. బిడ్డను తీసుకుని నగరమంతా తిరిగాడు. దుస్తులు కొనిచ్చాక ఫూటుగా మద్యం తాగాడు. ఆ తర్వాత గాంధీరోడ్డు, శ్రీదేవి కాంప్లెక్సు, దొడ్డాపురం వీధి తిరిగాడు. బుధవారం సాయంత్రం ఇంటికి వెళ్లడానికి శ్రీదేవి కాంప్లెక్సు వద్ద ఆటో ఎక్కాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది మద్యం మత్తులో ఉన్న కైలాస్ చెప్పలేదు. బిడ్డ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు. ఆ ప్రకారం.. టౌన్‌బ్యాంకు వద్ద ఆటో దిగి.. బిడ్డకు ఐస్‌క్రీము కొనిచ్చి.. మళ్లీ ఆటోలో అన్నమయ్య సర్కిల్ వద్దకు కైలాస్ చేరుకున్నాడు. అక్కడ బిడ్డతో కలిసి ఆటోలో వెళ్లినట్లు పరిణయ దుస్తుల దుకాణం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఆ ప్రకారం ఈస్ట్ ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మణికంఠ బృందం వీధి వ్యాపారులకు బిడ్డ ఫొటో చూపుతూ ఆరా తీశారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూలు వద్ద పూల వ్యాపారి లత వద్ద బిడ్డ ఉన్నట్లు తెలిసింది. అక్కడి వారిని విచారించగా, ఆమె వినాయక నిమజ్జనం కోసం బిడ్డను తీసుకుని పుత్తూరులోని పొట్టిగుట్టలు గ్రామానికి వెళ్లినట్లు చెప్పారు. దీంతో పోలీసులు గురువారం రాత్రి ఆ గ్రామానికి వెళ్లి లతను కలిశారు. 'ఓ వ్యక్తి ఫుల్‌గా మందు తాగి బిడ్డను వదలి పెట్టి వెళ్లడంతో నేను దగ్గరకు తీసుకున్నా. బిడ్డకోసం ఎవరైనా వస్తే నా ఫోను నెంబరు ఇవ్వాలని మా ఊరికి వస్తూ అక్కడి వారికి ఇచ్చా'నని ఆమె పోలీసులకు చెప్పారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు బిడ్డను తీసుకుని తిరుపతికి వచ్చారు. శుక్రవారం తల్లితండ్రులకు అప్పగించారు. ఈ విషయంలో విశేష ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మణికంఠకు రివార్డుల కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తానని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు.

సెబ్ రద్దు

● 120 మంది ఉద్యోగులు నేటి నుంచి ఎక్సైజ్ శాఖ పరిధిలోకి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు శనివారం నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాలుగా మారనున్నాయి. అక్కడ పనిచేస్తున్న 12 మంది సీఐలు, మరో 12 మంది ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ళు, సిబ్బంది మొత్తం 120 మంది మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఇక, పోలీసు శాఖ నుంచి డెప్యుటేషన్‌పై సెబ్‌లో పనిచేస్తున్న అదనపు ఎస్పీ రాజేంద్ర మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయనకు ఇప్పటి వరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక, తడ వద్ద కొత్తగా ఎక్సైజ్ చెక్‌పోస్టు ఏర్పాటు కానుంది. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, టాస్క్‌ఫోర్సు ఎన్‌ఫోర్సుమెంటు ఏసీ, మొబైల్ పార్టీలు ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ ప్రభుత్వ తీరుతో పంచాయతీలు నిర్వీర్యం

- కూటమి అధికారంలోకి వచ్చాక పటిష్ఠానికి చర్యలు
- పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్



తిరుపతి(విద్య), సెప్టెంబరు13: 'గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిధులు దారి మళ్లించింది. ఉపాధి హామీ నిధులు రూ.36 కోట్లను దుర్వినియోగం చేసింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన ఆగింది. పంచాయతీలు నిర్వీర్యమై.. సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకనే జగన్‌ను ఓడించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పంచాయతీలను బలోపేతం చేసేందుకు రూ.12.48 కోట్లను జమ చేసిందని గుర్తుచేశారు. ఉపాధిహామీ పనులకు రూ.9వేల కోట్లను జమ చేసి.. ఊరూరా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు ఏమేమి చేపట్టాలో మీరే నిర్ణయించండంటూ పంచాయతీలకు నిర్ణయాధికారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిన గ్రామీణ వ్యవస్థను, స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం బాగుచేసి జవసత్వాలు కల్పించాలని ఆయన కోరారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్, సింగంశెట్టి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు శుక్రవారం కూడా అందాయి. కలెక్టరు వెంకటేశ్వర్‌కు పలువురు చెక్కులు, డీడీలు అందించగా.. ఆయన వారిని అభినందించారు.



- జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల తరపున అధికారులు, సిబ్బంది రూ.7,47,776 చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.



- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తరపున రూ.2,32,100 చెక్కును సెట్విన్ పథక సంచాలకులు జయలక్ష్మి, సిబ్బంది అందజేశారు.
- జిల్లా విద్యాశాఖ తరపున రూ.లక్ష డీడీని అందించారు.
- చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం దిగువ మాఘం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎస్.మొగిలమ్మ రూ.51 వేలు.. రేణిగుంటలోని తపస్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల తరపున రూ.40 వేలు.. తిరుపతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది రూ.27 వేలు.. సెట్విన్ కార్యాలయ సిబ్బంది రూ.పది వేలు అందజేశారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13: సూళ్లూరుపేట మండ లంలోని పెరిమిటిపాడు సమీపంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

తెలుగు భాష ఆయన శ్వాస

● స.వెం. రమేశ్‌కు నేడు బొమ్మిడాల పురస్కారం



ఆయన పుట్టి పెరిగింది తమిళనాట. కానీ జన్మమూలాల అమ్మభాష అయిన తెలుగే శ్వాసగా తపిస్తున్నారు. భాషా రాష్ట్రాల పేరుతో తెలుగు భాష, సంస్కృతులకు కలిగిన ముప్పును వివరిస్తూ, కాపాడుకుందామంటూ ఉద్యమకారుడిగా అలుపెరగని ప్రయాణం సాగిస్తున్నారు. ఎల్లలకు అవల ఉన్న తెలుగుదనాన్ని లోకానికి చాటుతున్నారు. తెలుగు పరిశోధకుడిగా దేశదేశాలు పర్యటిస్తున్నారు స.వెం.రమేశ్. ఆయన చేస్తున్న విశేష కృషికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీకాళహస్తి కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం తెలుగు భాషోద్యమం నడుపుతున్న స.వెం.రమేశ్‌కు గుంటూరులో నేటి సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో బొమ్మిడాల పురస్కారం అందజేస్తారు.

గురువు పుష్పరాజ్ సహా ఏడుగురితో ఏర్పడిన తెలుగువాణి సంస్థ ద్వారా స.వెం.రమేశ్ తమిళనాడులోని వేలూరు ప్రాంతంలో తెలుగు తరగతులను ప్రారంభించారు. అనేక తెలుగు పల్లెల్లో తిరిగి తెలుగు రాయడం చదవడం నేర్పించారు. వేలూరు పరిసరాల్లోని 80 గ్రామాల్లో నాలుగు వేల మంది తెలుగు నేర్చుకున్నారు. వారిలో కొందరు తెలుగులో కథారచయితలుగా, కవులుగా మారారు. ఆ తరువాత కంచి, హోసూరు, తిరవళ్లూరు తదితర ప్రాంతాల్లో తెలుగు ఉద్యమాన్ని నడిపించి అక్కడి భాషాభిమానుల్లో ఉత్తేజం నింపారు. ఇక ప్రపంచ నలుమూలల్లోని తెలుగువారి మూలాల కోసం ఆయన అన్వేషణ కొనసాగింది. శ్రీలంక దేశంలో పాములు, కోతులు ఆడించే రెండు తెగల ప్రజలు తెలుగువారు ఉన్నట్లు గుర్తించి వారి దగ్గరకు వెళ్లి వారి జీవన సంస్కృతులు అధ్యయనం చేశారు. వారి తెలుగు మూలాలు వెలుగులోకి తెచ్చారు. అలాగే బంగ్లాదేశ్‌లోని వందలాది మారుమూల పల్లెల్లో సుమారు 6.5లక్షల మంది తెలుగువారు ఉన్న విషయం వెలుగులోకి తెచ్చారు. ఇక అమెరికా, మలేసియా, మారిషస్ దేశాల్లో కూడా ఆయన పర్యటించి తెలుగు భాషపై లోతైన పరిశోధన చేశారు. 200 ఏళ్ల క్రితం మలేషియాలో స్థిరపడ్డ తెలుగువారు నేటికీ గెంతు, దాటు భజనలు, కోలాటాలు, బుర్రకథలు పదిలంగా కాపాడుకోవడం గుర్తించారు. రచయితగానూ ఆయన రాసిన పుస్తకాలు అచ్చతెలుగు అక్షరాలతో అల్లిన పరిమళ దండలు. భాషాభిమానులను ఎంతగానో పెనవేసుకున్నాయి. ఇందులో ప్రధానంగా పులికాట్ తీర ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'ప్రళయ కావేరి కతలు' పుస్తకం, 'కతల గంప' విశేషంగా తెలుగు పాఠకులను ఆకట్టుకున్నాయి. ఎల'లు లేని తెలుగు' వ్యాసాల పుస్తకం, 'సజీవ సాంప్రదాయంగా వేమన' పరిశోధన పుస్తకం, వ్యాకరణంపై తెలుగు నుడికట్టు పుస్తకం స.వెం.రమేశ్ సాహిత్య, భాషా కృషిని వెల్లడిస్తాయి.

- శ్రీకాళహస్తి

రీడింగ్ రూములు కనుమరుగు





నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ పార్కులోని రీడింగ్‌రూము - సచివాలయంగా మారిన తూర్పువీధిలోని రీడింగ్‌రూము

గూడూరు, సెప్టెంబరు 13: పట్టణ ప్రజలకు విజ్ఞానాన్ని అందించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూములు నిర్వహణలేక కనుమరుగైపోయాయి. గతంలో గూడూరులో మున్సిపాలిటీ నిర్వహణలో 7 రీడింగ్ రూములు ఉండేవి. తూర్పువీధి, మసీదువీధి, పీఎస్ఆర్ పార్కు, అశోక్ నగర్, సీవీసీ పార్కు, కూరగాయల మార్కెట్ సమీపంలో ఏనుగు నరహరిరెడ్డి పార్కు, వాలయనందాపురం నీళ్లట్యాంకు ఆవరణలో రీడింగ్ రూములను ఏర్పాటు చేశారు. వీటిల్లో దినపత్రికలు, మేగజైన్లు, కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచేవారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు ప్రజలు, విద్యార్థులు పుస్తక పఠనం చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం రీడింగ్ రూముల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కొన్ని కనుమరుగు కాగా, మరికొన్ని నిరుపయోగంగా మారాయి. తూర్పువీధిలోని రీడింగ్ రూములో 10వ సచివాలయం ఏర్పాటు చేశారు. మసీదు వీధిలోని రీడింగ్‌రూమును మున్సిపల్ పాఠశాలలో కలిపేశారు. శిథిలావస్థకు చేరిన వాలయనందాపురం రీడింగ్‌రూము పునర్నిర్మాణాన్ని అసంపూర్తిగా ఆపేశారు. ఏనుగు నరహరరెడ్డి పార్కులోని రీడింగ్ రూము మూతపడింది. ఒక్క సీవీసీ పార్కులోని రీడింగ్ రూము తప్ప మరెక్కడ వినియోగంలో లేవు. కూటమి ప్రభుత్వం లోనైనా మున్సిపల్ రీడింగ్‌రూములను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకప్రియులు కోరుతున్నారు.

పొదుపు నిధుల గోల్‌మాల్‌పై విచారణ

డక్కిలి, సెప్టెంబరు 13: డక్కిలి మండలం నాగవోలు క్లస్టర్‌లో పొదుపు సంఘాల నిధుల గోల్‌మాల్ వ్యవహారానికి సంబంధించి శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు రెండో దఫా విచారణ చేపట్టారు. డక్కిలి వెలుగు కార్యాలయంలో అక్రమాలు చోటు చేసుకొన్నాయని, సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం ఇవ్వాలని ఏపీ ప్రజాసంఘాల కన్వీనర్ గద్దల మునెయ్య కోరారు. స్థానిక అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన ఉన్నతాధికారులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన అధికారులు 11 మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. అయితే నాగవోలు క్లస్టర్‌లో పనిచేస్తున్న వెలుగు సీసీ రమేష్ అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోలేదని జిల్లా ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వెలుగు ఏరియా కమ్యూనిటి కో ఆర్డినేటర్ తిరుపాల్‌రెడ్డి బృందం మండలంలోని దందవోలు, మోపూరు, పలుగోడు, నాగవోలు గ్రామాల్లో పొదుపు సంఘాల లావాదేవీల రికార్డులు పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను డీఆర్‌డీఏ పీడీకి అందచేస్తామని అధికారులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 13: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గూడూరు పట్టణంలో శనివారం ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు.

పెళ్లకూరు: మండలంలో శిరసనంబేడు, కప్పగుంటకండ్రిగ, చెంబేడు క్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ల పరిధిలోని మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకువిద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అంజాద్‌బాషా తెలిపారు.

సూళ్లూరుపేట: తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 6:30నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ ఖాదర్ బాషా తెలిపారు.

తడ: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు తడ మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళి తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్‌తో విద్యార్థులకు సౌకర్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: స్కూల్ కాంప్లెక్స్ విధానం విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. నాయుడుపేట విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం 11 మండలాల ఎంఈవోలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఒకే పంచాయతీ, ఒకే సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ విధానంలో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. సంబంధిత రికార్డు వర్కులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో సూచించారు. అదే విధంగా ఈ నెల 19, 20వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల ఏర్పాట్లపై ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు స్వాహా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు స్వాహా చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణానికి శారద అనే మహిళ ఈనెల 9వ తేదీన భరత్ నగర్‌లోని ఏటీఎంలోకి నగదు డ్రా చేసేందుకు వెళ్లింది. ఆమెకు ఏటీఎం కార్డు వినియోగించడం తెలియకపోవడంతో పక్కనే ఉన్న ఓ యువకుడు నగదు తీసిస్తానని కార్డు తీసుకున్నాడు. శారదను ఏమార్చి తన వద్ద నకిలీ కార్డుతో నగదు డ్రా చేస్తున్నట్లు నటించాడు. డబ్బులు రావడంలేదంటూ నకిలీ కార్డు ఆమెకు ఇచ్చేసి అసలు కార్డు తీసుకెళ్లిపోయాడు. కొంత సమయం తరువాత తన ఫోన్‌కు రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఆ మహిళ మోసపోయినట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యంత్రాలతో ఉపాధి పనులు

బిల్లులు చెల్లించవద్దని ఏపీడీ ఆదేశం



ఉపాధి పనుల పరిశీలనకు వచ్చిన ఏపీడీతో యాక్టివ్ మేట్ వాగ్వాదం

బాలాయపల్లి, సెప్టెంబరు 13: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో ఉపాధి పనులను యంత్రాలతో చేపట్టారు. ఈ విషయమై గ్రామస్తులు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు శుక్రవారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సిద్దాగుంటలో జరుగుతున్న ఉపాధి పనుల పరిశీలనకు వచ్చిన ఏపీడీ వరప్రసాద్‌రావును సుబ్రమణ్యంలో యంత్రాలతో చేపడుతున్న పనులను పరిశీలించమని పీడీ ఆదేశించారు. దీంతో ఏపీడీ సుబ్రమణ్యం గ్రామానికి వెళ్లి యంత్రాలతో చేపట్టిన పంటకాలువ పనులను పరిశీలించారు. క్షేత్ర సహాయకుడిని పిలిచి వర్క్ ఐడీ నంబరు, ఎస్టిమేషన్ వివరాలు అడుగుతుండగా యాక్టివ్ మేట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఏపీడీతో వాదనకు దిగారు. ఆగ్రహించిన వరప్రసాద్‌రావు యంత్రాలతో చేపడుతున్న పనులకు బిల్లులు చెల్లించవద్దని క్షేత్ర సహాయకుడిని ఆదేశించి వెళ్లి పోయారు.

వాణిజ్య బ్యాంకులకు . దీటుగా సహకార సంఘాల సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రవిరాజశేఖర్

గూడూరు, సెప్టెంబరు 13: వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని డివిజనల్ సహకారశాఖ సహాయ అధికారి రవిరాజశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక 24 సొసైటీ కార్యాలయ ఆవరణలో మహాజనసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు అభివృద్ధి చెందేలా కేంద్రప్రభుత్వం ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా కంప్యూటరీకరణ చేస్తోందన్నారు. సంఘ సభ్యులందరూ కేవైసీ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానాన్ని త్వరితగతిన పూర్తిచేసి సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్యామ్ కుమార్, సత్యవతి, నారాయణ, రామయ్య, పులమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, జనార్దనరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 13: స్థానిక విశ్వనాథపురంలో శ్రీనివాస సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సుమన్ దంత ఆస్పత్రి సహకారంతో దంత వైద్య శిబిరం నిర్వహించారు. 150మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా పేస్టు, బ్రష్‌లు అందజేశారు.

బాలిక అదృశ్యం



అఫ్రీన్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13: సూళ్లూరుపేట పట్టణానికి చెందిన షేక్ అఫ్రిన్(12) శుక్రవారం అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.... పట్టణంలోని గాండ్లవీధికి చెందిన షేక్ అజముద్దీన్, వదియా దంపతుల కుమార్తె అఫ్రీన్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం 5:30 గంటల సమయంలో ట్యూషన్‌కు బయలుదేరింది. మార్కెట్ వీధిలో నడిచి వెళ్తున్న బాలికను చిన్నాన్న మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి పాఠశాల గేటు వద్ద వదిలిపెట్టి వచ్చాడు. 8 గంటలైన బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లి దండ్రులు పాఠశాలకు వద్దకు వెళ్లి విచారించగా ట్యూషన్‌కు రాలేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పాఠశాల వద్దనున్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా బాలిక ట్యూషన్‌కు వెళ్లకుండా పాఠశాల గేటు వద్ద నుంచి వెనుతిరిగినట్లు కనిపించింది. అఫ్రిన్‌ను రైల్వేస్టేషన్ వద్ద చూసినట్లు స్థానికులు కొందరు చెబుతున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇతర ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు బాలిక ఫొటోతో సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మ నాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 13: మలుపు తిరుగుతున్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఢిల్లీకి చెందిన తమిల్ మాలిక్(25) శ్రీసిటీ సెజ్‌లోని పరిశ్రమలో పని చేస్తూ తడలో నివాసం ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఆరంబాకం వరకు వెళ్లాడు. అక్కడ నుంచి తడకు వస్తుండగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద మలుపు తిరుగుతున్న లారీని బైక్‌తో వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తమిల్ మాలిక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణ పరిధిలోని తుమ్మూరుకు చెందిన చంద్రమ్మ, ఆమె భర్త పట్టణంలో లాండ్రి దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం బజారుకు వెళ్లిన చంద్రమ్మ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లేకపోవడంతో చంద్రమ్మ కుమారుడు రాజశేఖర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: నాయుడుపేట స్వర్ణముఖినది తీరం సమీపంలో మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి పట్టణానికి చెందిన అభిలాష్ రోడ్డు పక్కన నిలబడి ఉండగా, అటువైపు వచ్చిన మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అభిలాష్‌తో పాటు మోటారు సైకిలిస్టు వేణుగోపాల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెళ్లకూరు ఎస్ఐగా నాగరాజు



పెళ్లకూరు, సెప్టెంబర్ 13: పెళ్లకూరు ఎస్ఐగా కే.నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన ఎస్ఐ శ్రీకాంత్‌ను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న నాగరాజును నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యల తీసుకుంటామని స్పష్టం చేశారు.

అన్నదానం



గూడూరు, సెప్టెంబరు 13: స్థానిక ముత్యాలపేటలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

టైలరింగ్ కోర్సు ప్రారంభం

నాయుడుపేట, సెప్టెంబరు 13: పట్టణంలోని గాంధీ మందిరం సెంటర్ వద్ద ఉచితంగా టైలరింగ్ కోర్సును రాస్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు, రాస్ సభ్యులు వెంకటేష్, వినోద్‌కుమార్, సునీత, రమణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 13: వెంకటగిరి పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో వైభవంగా నిరహించనున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కురుగొండ్లతో కలిసి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తిన్నెలపూడి సహకార సంఘంలో మహాజన ఉత్సవాలు

కోట, సెప్టెంబరు 13: కోటలోని తిన్నెలపూడి వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం మహాజన ఉత్సవాలు జరిగాయి. పర్సన్ ఇన్‌చార్జి మహేష్‌సింగ్, సీఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు కల్పిస్తున్న రాయితీలు, రుణాలపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యుల కేవైసీని ప్రారంభించారు. సహకార సంఘంలో లావాదేవీలను కంప్యూటరీకరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం అశోక్‌కుమార్, సురేంద్రరెడ్డి, శ్యామసుందర్, సహకార బ్యాంక్ మేనేజర్ సాయికేశవరావు, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, నరసరాజు, నెల్లూరుపల్లికొత్తపాళెం, ఊనుగుంటపాళెం, సిద్ధవరం, చిట్టేడు సహకార సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో జ్యోతికిరణ్

చిల్లకూరు, సెప్టెంబరు 13: చిల్లకూరు మండలం తిక్కవరం ఎస్టీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏసీడీపీవో జ్యోతికిరణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, రమణమ్మ, రోజా, చంద్రమ్మ, ఆషాభేగం, సుమలత పాల్గొన్నారు.

కేశవరంలో పౌష్టికాహార మాసోత్సవాలు

కోట, సెప్టెంబరు 13: మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు గ్రామాల్లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. సీడీపీవో మునికుమారి సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ పాల్గొని పౌష్టికాహారాన్ని ఇచ్చే ఆకుకూరలు, కాయగూరల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

క్రీడాకారులకు శుభాకాంక్షలు



క్రీడాకారులతో టెన్నీకాయిట్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 13: టెన్నీకాయిట్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్న జిల్లా జట్టు క్రీడాకారులకు ఆయన దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాన్సర్ బాధితుడికి నందమూరి ఫ్యాన్స్.కాం చేయూత



కౌశిక్ తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న నందమూరి ఫ్యాన్స్ డాట్‌కామ్ ప్రతినిధులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13:క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోలేక... రోజు రోజుకూ మరణానికి దగ్గరౌతున్న ఓ యువకుడికి నందమూరి ఫ్యాన్స్‌కాం ఆర్థిక సాయం అందించింది. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన పందొమ్మిదేళ్ల యువకుడు కౌశిక్ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'దేవర సినిమాచూసి చచ్చిపోతా... అమ్మా అప్పటిదాకా బతికించండి' శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.స్పందించిన నందమూరి ఫ్యాన్స్‌కాం వెబ్‌సైట్ ప్రతినిధులు బాధితుడి ఇంటికి చేరుకుని 40వేల రూపాయల నగదును కౌశిక్ తల్లిదండ్రులకు అందజేశారు. నందమూరి హీరోల అభిమానులు కొంతమంది నందమూరి .కాం పేరున ఓ వెబ్‌సైట్‌ను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి వీరు ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో అనేకమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడం, పేదవారికి ఆర్థికసాయం అందించడం లాంటి సేవలు అందిస్తున్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విద్యానగర్ సెంటర్‌లో విరాళాలు సేకరిస్తున్న జనసేన నాయకులు

కోట, సెప్టెంబరు 13: మండల కేంద్రమైన కోట, విద్యానగర్‌లో జనసేన నేతలు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు శుక్రవారం జోలిపట్టి విరాళాలు సేకరించారు. పట్టణంలోని బజారుసెంటర్, క్రాస్ రోడ్డు, ఆర్టీసీ సెంటర్, విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్, కొత్తపాళెం రోడ్డులో జనసేన నేతలు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు అల్లంబాబు, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు, గూడూరు కృష్ణ, చంద్రశేఖర్, హుస్సేన్, మున్నపతి, రేవంత్, వినోద్, హర్ష, మస్తాన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళం

వాకాడు, సెప్టెంబరు 13: మండలంలోని వాకాడు సెయింట్‌పాల్ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ సుమంత్ ఏపీపీయూఎస్ఎంఏ ప్రెసిడెంట్ జివి.పవన్‌కుమార్‌కు చెక్కు అందజేశారు.

సీతారామ్ ఏచూరి సేవలు చిరస్మరణీయం



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 13: భారత కమ్యూనిస్టు ఉద్యమ ముద్దుబిడ్డ సీతారామ్ ఏచూరి సేవలు చిరస్మరణీయమని సీఐటీయూ నేత ముకుంద అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ, సీఐటీయూ సభ్యుడు వీరాస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సునీల్, రజక సంఘం నాయకుడు పుట్టయ్య, యూటీఎఫ్ నాయకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దాతల చొరవ అభినందనీయం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 13: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గంలోని పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో వరద బాధితుల సహాయార్థం కళాశాల ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి రూ.1,03,015 చెక్కు ఎమ్మెల్యేకు అందజేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు సేకరించిన దుస్తులను విజయవాడకు పంపే వాహనాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి సాగనంపారు. కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు, హనుమంతరావు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలువురు దాతలు సీఎం సహాయనిధికి విరాళాల చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

గణనాథుల గ్రామోత్సవం



కోట బజారుసెంటర్‌లో ఊరేగుతున్న గణనాథుడు

కోట, సెప్టెంబరు 13: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణనాథుల గ్రామోత్సవం జరిగింది. కోట పట్టణంలోని ఎన్‌సీఆర్‌నగర్, శ్రీలక్ష్మమ్మకాలనీలో గణేష్ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో యువత కేరింతలు కొడుతూ గణేష్ విగ్రహాలను ఊరేగించి శ్రీనివాససత్రం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు.